# వేకువ సమయం

సంపుటి: 14 సంచిక: 146

VEKUVA SAMAYAM TELUGU DAILY

⋆ Mahabubnagar ⋆ Hyderabad ⋆ Miryalaguda & Rangareddy | సంపాదకులు : కె.భాస్కర్‌రావు | రూ.2.00/- పేజీలు 8 | తేదీ: శుక్రవారం 19 జూన్ 2026








**సమయం ప్రతినిధి:** ప్రముఖ మెసేజింగ్ ప్లాట్ ఫామ్ టెలిగ్రామ్ (Telegram) చట్టవిరుద్ధ కార్యకలాపాలకు, సైబర్ నేరాలకు ప్రధాన వేదికగా మారిందని కేంద్ర ప్రభుత్వం పేర్కొంది. ప్రస్తుత రోజుల్లో టెలిగ్రామ్ ఓ సరికొత్త 'డార్క్ వెబ్'లా రూపాంతరం చెందిందని, నేరస్థులు, సైబర్ మోసగాళ్లు, తీవ్రవాద గ్రూపులు చట్టం నుంచి తప్పించుకోవడానికి దీనిని విరివిగా ఉపయోగిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేసింది. ఈ మేరకు ఢిల్లీ హైకోర్టులో ప్రభుత్వం ఇవాళ ఓ కీలక అఫిడవిట్ దాఖలు చేసింది. లీకైన పరీక్ష పత్రాలు - ప్రశ్నార్థకమైన భవిష్యత్తు: NEET వంటి ప్రతిష్ఠాత్మక పరీక్షల ప్రశ్నపత్రాల లీకేజీ, పంపిణీకి టెలిగ్రామ్ ఛానళ్లు వేదికగా మారాయని ప్రభుత్వం పేర్కొంది. ఇది దేశంలోని లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తును ప్రమాదంలో పడేస్తోందని తెలిపింది. సైబర్ నేరాలు, డేటా లీకులు: నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్ డేటా ప్రకారం, టెలిగ్రామ్ వేదికగా జరుగుతున్న సైబర్ మోసాలపై ఫిర్యాదులు భారీగా పెరిగాయి. హ్యాకర్లు, సైబర్ నేరగాళ్లు దొంగిలించిన డేటాను ప్లాట్‌ఫామ్‌ను వాడుతున్నారు.




**సమయం ప్రతినిధి:** కస్టోడియల్ మరణాలపై మధ్యప్రదేశ్ హైకోర్టు సంచలన తీర్పునిచ్చింది. నిందితులను కస్టడీలో కొట్టి చంపడం పోలీసుల 'అధికారిక విధి' కాదని తేల్చి చెప్పింది. నిందితులైన పోలీసులను శిక్షించేందుకు ప్రభుత్వం నుంచి ముందస్తు అనుమతి అవసరం లేదని ధర్మాసనం స్పష్టం చేసింది. ఈ మేరకు ఇండోర్ జిల్లా కోర్టు ఉద్యోగి పంకజ్ వైష్ణవ్ కస్టోడియల్ డెత్ కేసులో పోలీసుల పిటిషన్‌ను కొట్టివేస్తూ జస్టిస్ గజేంద్ర సింగ్ సంచలన ఆదేశాలిచ్చారు. ఈ సందర్భంగా కస్టోడియల్ మరణాలపై హైకోర్టు ధర్మాసనం ఘాటు వ్యాఖ్యలు చేసింది. సభ్య సమాజంలో కస్టోడియల్ మరణాలు అత్యంత ఘోరమైన నేరాలని మధ్యప్రదేశ్ హైకోర్టు అభిప్రాయపడింది. థర్డ్ డిగ్రీ ప్రయోగించడం, రికార్డులు ఫోర్జరీ చేయడం పోలీసుల విధి నిర్వహణ కిందికి రావని ఈ సందర్భంగా పేర్కొంది. ప్రభుత్వ ఉద్యోగుల ముందస్తు అనుమతి నిబంధన (Sanction) ఈ కేసులో వర్తించదని వెల్లడించింది. భోపాల్ ఎయిమ్స్ ఆస్పత్రి పోస్టుమార్టం నివేదికలో బాధితుడిపై పోలీసుల హింస నిజమేనని తేలిందని కోర్టు ప్రస్తావించింది. చట్టాన్ని చేతుల్లోకి తీసుకునే పోలీసులకు రక్షణ కవచాలు ఉండవని స్పష్టం చేసింది.




**సమయం ప్రతినిధి:** తమిళనాడు రాజకీయాల్లో మరో కొత్త అంశం తెరపైకి వచ్చింది. డీఎంకేకు చిరకాల మిత్రపక్షమైన మరుమలార్చి ద్రవిడ మున్నేట్ర కళగం(ఎండీఎంకే) అధికార తమిళగ వెట్రి కళగం(టీవీకే)తో జట్టుకట్టనుందా? అనే చర్చ ఆ రాష్ట్ర రాజకీయాల్లో జోరందుకుంది. ఎండీఎంకే ప్రధాన కార్యదర్శి వైకో.. సీఎం జోసెఫ్ విజయ్‌తో భేటీ కావడం ఈ ఊహాగానాలకు బలం చేకూరుస్తోంది. కాగా.. ఇటీవలే వైకో కుమారుడు, ఎండీఎంకే ఎంపీ దురై వైకో కూడా విజయ్‌తో సమావేశమైన సంగతి తెలిసిందే. కాగా.. 2026 అసెంబ్లీ ఎన్నికల్లో డీఎంకే నేతృత్వంలోని కూటమిలో ఎండీఎంకే పోటీచేసి రెండు స్థానాలను కైవసం చేసుకుంది. ఆ పార్టీ సాధారణ మండలి సమావేశం ఈ నెలాఖరులో జరగనుంది. పార్టీ భవిష్యత్తు రాజకీయ దిశగా ఆ సమావేశంలో కీలక నిర్ణయం తీసుకునే అవకాశమున్నట్టు తెలుస్తోంది. అయితే.. టీవీకే నేతృత్వంలోని మైనారిటీ ప్రభుత్వంపై జరిగిన విశ్వాస పరీక్షలో ఎండీఎంకే తటస్థంగా వ్యవహరించింది. డీఎంకేతో కలిసి పనిచేసిన పలువురు మాజీ మిత్రపక్షాలు ఇప్పటికే టీవీకే ప్రభుత్వానికి మద్దతిస్తున్నాయి.

## అమెరికా రాయబారితో అమిత్ షా భేటీ



న్యూఢిల్లీ: కేంద్ర హోంమంత్రి అమిత్ షా గురువారం అమెరికా రాయబారి సెర్జియో గోర్‌తో న్యూఢిల్లీలో సమావేశమయ్యారు. ఇరు దేశాల మధ్య భద్రతా సహకారాన్ని మరింత బలోపేతం చేయడం, ముఖ్యంగా ఉగ్రవాద నిరోధక చర్యలు, మాదక ద్రవ్యాల అక్రమ రవాణా నియంత్రణ అంశాలపై విస్తృతంగా చర్చించారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో భారత్-అమెరికా సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత ముందుకు తీసుకెళ్లేందుకు భారత్ కట్టుబడి ఉందని అమిత్ షా పేర్కొన్నారు.

## నీట్ పునఃపరీక్ష ఏర్పాట్లపై కేంద్ర మంత్రి సమీక్ష



న్యూఢిల్లీ : జూన్ 21న నిర్వహించనున్న నీట్ యూజీ పునఃపరీక్ష ఏర్పాట్లపై కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ గురువారం ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. పరీక్షను పూర్తి పారదర్శకంగా, నిష్పాక్షికంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పరీక్ష కేంద్రాల్లో తాగునీరు, కూర్చునే సౌకర్యం తదితర మౌలిక వసతులు కల్పించాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వాలు, జాతీయ పరీక్షల సంస్థ, జిల్లా యంత్రాంగం సమన్వయంతో పనిచేసి పరీక్షను ప్రశాంతంగా నిర్వహించాలని మంత్రి కోరారు.



## వీకెండ్‌లో వచ్చి వెళ్లిపోతారు..

సిరిసిల్ల : మాజీమంత్రి కేటీఆర్‌పై తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత షాకింగ్ కామెంట్స్ చేశారు. కేటీఆర్ సిరిసిల్లాకు వీకెండ్‌లో వచ్చి వెళ్లిపోతారని ఎద్దేవా చేశారు. ఈరోజు (గురువారం) సిరిసిల్లలో కవిత పర్యటించి. పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కవిత మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ సర్కార్ రైతన్నల నడ్డి విరిస్తే కేటీఆర్ ఎందుకు మాట్లాడట్లేదని ప్రశ్నించారు. సిరిసిల్లలో సెస్ ఆగమాగం అయితే కేటీఆర్ ఎందుకు పట్టించుకోలేదని నిలదీశారు.

**దళితులపై థర్డ్ డిగ్రీ ప్రయోగించారు..** రైతు డిస్కంలపై ఇప్పటి వరకు కేటీఆర్ ఎందుకు నోరెత్తలేదని కవిత ప్రశ్నల వర్షం కురిపించారు. రైతు డిస్కం కావాలో, వద్దో ఆయన ఎందుకు చెప్పలేదని నిలదీశారు. నేరెళ్లలో అక్రమ ఇసుక సంపాదన కోసం దళితులపై థర్డ్ డిగ్రీ ప్రయోగించారని ధ్వజమెత్తారు. నేరెళ్ల బాధితులకు ఇప్పటి వరకు ఎలాంటి న్యాయం జరగలేదని చెప్పుకొచ్చారు.




**రంగారెడ్డి, సమయం ప్రతినిధి :** ఎవరైనా ప్రభుత్వ భూములను కబ్జా చేయాలని చూస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హెచ్చరించారు. కబ్జాలతో ప్రజలకు సమస్యలు రాకూడదనే హైడ్రా తీసుకువచ్చామని ప్రస్తావించారు. హైడ్రాను ఒక భూతంలా కొందరు చూపెడుతున్నారని ధ్వజమెత్తారు. హైడ్రా పేదల జోలికి వెళ్లదని.. కబ్జాదారుల భరతం పడుతుందని స్పష్టం చేశారు. గుర్రంగూడ ఎకో పార్క్‌ను కబ్జా చేయాలని కొంతమంది చూశారని ఫైర్ అయ్యారు. వనస్థలిపురంలో దేవుడి భూములనూ కూడా కబ్జా పెట్టారని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

**వనమహోత్సవం కార్యక్రమం ప్రారంభం..** ఈరోజు(గురువారం) గుర్రంగూడ ఎకో పార్క్‌లో వన మహోత్సవం కార్యక్రమాన్ని సీఎం ప్రారంభించారు. హరిత నిధి ద్వారా నాగలింగం మొక్కను ముఖ్యమంత్రి నాటారు. రోబోటిక్ ఏనుగును ఆవిష్కరించారు. ఈ క్రమంలో గుర్రంగూడ ఎకో పార్క్ నమూనాను అటవీ అధికారులు.. సీఎంకి వివరించారు. ఎకో పార్క్‌లో రూ.35.50 కోట్లతో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. గుర్రంగూడ రిజర్వ్ ఫారెస్ట్‌లో రూ.17.84 కోట్లతో అభివృద్ధి పనులని ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడారు. 2018లో కొందరి కుట్ర వల్ల కొడంగల్‌లో ఓడిపోయానని చెప్పుకొచ్చారు. ఏమీ చేయలేనని కొందరు భావించారని అన్నారు. మల్కాజ్‌గిరి ప్రజలు తనను ఎంపీగా గెలిపించారని తెలిపారు.

## ఓటర్ల జాబితా సవరణకు రాజకీయ పార్టీల సహకారం అవసరం



**మహబూబ్‌నగర్, (సమయం ప్రతినిధి):** ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు రాజకీయ పార్టీల ప్రతినిధులు క్షేత్రస్థాయిలో బూత్ స్థాయి అధికారులతో సమన్వయం చేసుకుంటూ సహకరించాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా కోరారు. గురువారం జిల్లా కలెక్టరేట్‌లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన ప్రత్యేక సమగ్ర సవరణ సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. ఓటర్ల జాబితా ప్రక్షాళనను పారదర్శకంగా నిర్వహించేందుకు రాజకీయ నాయకులు సహకరించాలని కోరారు. బూత్ స్థాయి అధికారులు, నియోజకవర్గ స్థాయి అధికారులకు క్షేత్రస్థాయి శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జూన్ 25 నుంచి జూలై 24 వరకు బూత్ స్థాయి అధికారులు ప్రతి ఇంటికి వెళ్లి గణన పత్రాలను పంపిణీ చేసి వివరాలు సేకరిస్తారని చెప్పారు. 2002 ఓటర్ల జాబితా ఆధారంగా కుటుంబ సభ్యుల వివరాలను నమోదు చేయాల్సి ఉంటుందని వివరించారు. జూలై 24 నుంచి 30 వరకు ప్రతి పోలింగ్ కేంద్రంలో గరిష్టంగా 1,200 మంది ఓటర్లు ఉండేలా పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ చేపడతామని తెలిపారు. జూలై 31న ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురించి, అభ్యంతరాల పరిశీలన అనంతరం అక్టోబర్ 1న తుది ఓటర్ల జాబితాను విడుదల చేస్తామని చెప్పారు. తప్పుడు సమాచారం అందించిన వారి పేర్లను వెంటనే తొలగించకుండా నోటీసులు జారీ చేసి విచారణ అనంతరం చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. వలస వెళ్లిన వారు, మరణించిన వారు, ద్వంద్వ ఓటర్లను గుర్తించి జాబితా నుంచి తొలగిస్తామని తెలిపారు. ప్రజాప్రాతినిధ్య చట్టం-1950లోని సెక్షన్ 31 ప్రకారం ఉద్దేశపూర్వకంగా తప్పుడు సమాచారం ఇస్తే ఒక సంవత్సరం వరకు జైలు శిక్ష, జరిమానా లేదా రెండూ విధించే అవకాశం ఉందని హెచ్చరించారు. ప్రస్తుత జాబితాలో పేరు లేని కొత్త ఓటర్లు తప్పనిసరిగా ఫారం-6 ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 2026 అక్టోబర్ 1 నాటికి 18 సంవత్సరాలు పూర్తిచేసుకున్న ప్రతి ఒక్కరూ ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవడానికి అర్హులని తెలిపారు. ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి మారిన వారు ఫారం-8 ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ హరిప్రియ, శిక్షణ సహాయ కలెక్టర్ సాయి శివాని, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

# సంపాదకీయం

## విపక్ష రాజకీయాల్లో మౌలిక మార్పు ఎలా?

పది రోజుల క్రితం జరిగిన ప్రతిపక్ష ఇండియా కూటమి సమావేశం మన కాలపు ఒక రాజకీయ ఆవశ్యకతను గుర్తుచేసింది. తమ విధ్యుక్త ధర్మ నిర్వహణలో ప్రతిపక్షాలు సరికొత్తగా పునఃప్రారంభమవడమే వాటి ప్రస్తుత కర్తవ్యమవాలి. దూరదృష్టి, దీక్షా దక్షతలతో కూడిన ప్రతిపక్షాల క్రియాశీలతను అవి చూపాలి. అవును, ప్రతిపక్షాల ఐక్యత మనకు అవసరం, అత్యవసరం కూడా. అంతే కాకుండా ఒక శక్తిమంతమైన సమైక్య ప్రతిపక్షం పునరుద్ధరణ ఇప్పుడు మనకు అవసరం. సందేహం లేదు, నేడు మనకు సరికొత్త, సమైక్య ప్రతిపక్షం ఆవశ్యకత మునుపెన్నడూ లేని విధంగా ఉన్నది. అది అవశ్యం. ఎందుకని? రాజ్యాంగబద్ధమైన మార్గాల ద్వారానే నిరంకుశత్వం ప్రబలుతున్న సందర్భంలో మనమున్నాం. రాజ్యాంగ సంస్థల మధ్య ఉండాల్సిన సమతౌల్యత క్రమంగా క్షీణిస్తోంది. ఫలితంగా ప్రజాస్వామిక పాలన బలహీనపడుతోంది. అధికారాలు కేంద్రీకృతమవుతున్నాయి. ఈ పరిస్థితుల పట్ల ప్రజా వ్యతిరేకత కూడా ప్రబలుతోంది. సంకుచిత మెజారిటేరియన్ శక్తుల ప్రాబల్యం నుంచి మన గణతంత్ర రాజ్యాన్ని రక్షించుకోవాల్సిన అవసరమున్నది. ఈ సవాల్ నెదుర్కొనేందుకు ప్రతిపక్ష ఇండియా కూటమి ఏ మేరకు సంసిద్ధంగా ఉన్నదీ ఇప్పుడే చెప్పలేం. మన ప్రజాస్వామ్యం మనుగడ ఒక విషమ పరిస్థితిలో ఉన్నది. దీన్ని అధిగమించేందుకు ప్రతిపక్షాలు సంప్రదాయ రాజకీయ పద్ధతులకు భిన్నమైన మార్గాలను అనుసరించడం ముఖ్యం. అందుకు నిజమైన రాజనీతిజ్ఞత అవసరం. అంతకంటే ముఖ్యంగా నైతిక నిబద్ధత చూపాలి. ప్రతిపక్ష రాజకీయాలలో ఒక మౌలిక మార్పు రావాలి. ఇదెలా సాధ్యమవుతుంది? ఎన్నికలలో గెలుపు సాధించడమే ధ్యేయంగా ఉండకూడదు. ప్రభుత్వ అధికారాన్ని స్వాధీనం చేసుకోవడమే లక్ష్యంగా ఉన్న రాజకీయాల నుంచి గణతంత్రాన్ని కాపాడుకునే రాజకీయాల దిశగా ఆ మార్పు ఉండాలి. ఇందుకు ప్రతిపక్షాల దృక్పథం మారాలి. ప్రతిపక్షం విధులను పునర్ నిర్వచించాలి. ప్రతిపక్షాల ఐక్యతకు ప్రయత్నించాలి. ప్రతిపక్ష రాజకీయాలు చేయడమంటే ఏమిటో కొత్త ఆలోచనలతో నిర్ణయించుకోవాలి. తమ రాజకీయ కార్యాచరణలో ప్రజలను భాగస్వాములను చేసుకోవాలి. ఈ కార్యాచరణపరమైన మార్పు తప్పనిసరి. ఆ దిశగా మొదటి అడుగు పలు ప్రధాన ప్రతిపక్షాలు భాగస్వాములుగా ఉన్న 'ఇండియా' కూటమిని పునరుజ్జీవింపచేయడమే. తద్వారా మాత్రమే ప్రస్తుతం అధికారంలో ఉన్న పాలకులను సవాల్ చేయడం సాధ్యమవుతుంది. ప్రస్తుత నాయకులతోనే అది జరగాలి. ఈ నాయకుడి లేదా ఆ నాయకుడి యోగ్యతలు, అయోగ్యతల విషయమై చర్చలు వ్యర్థం. ప్రత్యామ్నాయ వ్యవస్థీకృత రాజకీయాలను అభివృద్ధిపరచడమే లక్ష్యంగా ఉండాలి. 2024 సార్వత్రక ఎన్నికలలో భారతీయ జనతా పార్టీని గట్టిగా సవాల్ చేసేందుకు ప్రతిపక్షాలు వేసిన ముందడుగే 'ఇండియా' కూటమి ఏర్పాటు. గత లోక్‌సభ ఎన్నికలలో బీజేపీకి కనీస మెజారిటీ సైతం లభించకుండా చేయడంలో ఇండియా కూటమి సఫలమయింది. అయితే తదాది దాని ప్రస్థానం నిరాశాజనకంగా సాగుతూ వస్తోంది. గత సార్వత్రక ఎన్నికల అనంతరం వివిధ రాష్ట్రాలలో జరిగిన అసెంబ్లీ ఎన్నికలలో బీజేపీ మంచి విజయాలు సాధించి దేశ రాజకీయాలలో తన స్థానాన్ని మరింతగా బలోపేతం చేసుకున్నది. ఆ సార్వత్రక విజయం అనంతరం ప్రభుత్వ ఆధ్వర్యంలోని దర్యాప్తు సంస్థలను ఉసిగొల్పి పలు ప్రతిపక్షాలకు తీరని నష్టం వాటిల్లేలా చేసింది. ఈ పరిణామంతో ప్రతిపక్షాలలో నైతిక స్థైర్యం దిగజారిపోయింది. విపక్షాల స్వీయ తప్పిదాలు కూడా వాటి ప్రస్తుత దుస్థితికి కారణమయ్యాయన్నది ఎవరూ కొట్టివేయలేని సత్యం. నిజానికి ఇండియా కూటమి సమావేశం ఎప్పుడోనే జరిగి ఉండవల్సింది. జూన్ 8 నాటి సమావేశం భాగస్వామ్య పక్షాలు తమ మధ్య అంతర్గత విభేదాలను తొలగించుకునేందుకు తోడ్పడింది. తరచూ సమావేశమవ్వాలని, పార్లమెంటులో సమన్వయ సహకారంతో పనిచేయాలని 'ఇండియా' భాగస్వాములు నిర్ణయించుకోవడం ముదావహం. అయితే ఆ సమావేశం అనంతరం ప్రకటించిన కార్యాచరణ పథకం ప్రభుత్వాన్ని సమర్థంగా సవాల్ చేసేందుకు సహాయపడుతుందా? నియోజకవర్గాల పునర్వ్యవస్థీకరణకు సంబంధించిన డీలిమిటేషన్ బిల్లును అడ్డుకోవడంలో సాధించిన విజయం స్ఫూర్తితో రాజ్యాంగ సంస్థల కూల్చివేతకు జరుగుతోన్న ప్రయత్నాలను నిరోధించేందుకు విపక్షాలు ఒక సమైక్య వ్యూహాన్ని రూపొందించుకోవాలి.ఇందుకు ఇండియా కూటమికి వెలుపల ఉన్న ప్రతిపక్షాలతో ప్రయోజనకరంగా పొత్తు పెట్టుకోవల్సిన అవసరమున్నది. ప్రజల విశ్వసనీయతను పొందేందుకు ఇది తోడ్పడుతుంది. రాజకీయ పక్షాల విషయాన్ని అలా ఉంచితే ఇప్పుడు దేశవ్యాప్తంగా అనేక సమస్యలపై ప్రజా నిరసనలు, ప్రజా పోరాటాలు ప్రజ్వరిల్లుతున్నాయి. బీజేపీ–ఆరెస్సెస్‌లను మొదటి నుంచీ సైద్ధాంతికంగా వ్యతిరేకిస్తున్న ప్రజా సంఘాలు ఆ ఆందోళనలలో కొన్నిటికి నాయకత్వం వహిస్తున్నాయి. వామపక్షాలకు అనుబంధంగా ఉన్న కార్మిక సంఘాలు, రైతు సంఘాలు, ఇంకా పౌర, మానవ హక్కుల సంఘాలు మొదలైనవి ప్రజా చైతన్యాన్ని పెంపొందిస్తున్నాయి. వివిధ సామాజిక సముదాయాల ప్రత్యేక సమస్యలపై పోరాడుతున్న ప్రజా సంఘాల పోరాటాలు తప్పనిసరిగా భావజాలపరమైనవి కాకపోవచ్చు కానీ ఆదివాసీలు, ఓబీసీలు, దళితులు, సంచార జాతులు, మైనారిటీలలో ప్రజాస్వామిక చైతన్యానికి అవి తోడ్పడుతున్నాయి. ప్రశ్న పత్రాల లీకేజీ, అభివృద్ధి ప్రాజెక్టుల నెపంతో ప్రభుత్వాలు చేస్తున్న భూసేకరణ, పాలనా వ్యవస్థల్లో అవినీతి తదితర సమస్యలకు వ్యతిరేకంగా రగులుతున్న నిరసనలు, సాగుతున్న పోరాటాలు ఒక స్పష్టమైన సైద్ధాంతిక స్ఫూర్తితో బీజేపీ పాలనను వ్యతిరేకిస్తున్నవి కావు. ఈ వాస్తవాలు, 'కాక్రోచ్ జనతా పార్టీ' పట్ల ప్రతిపక్షం దృక్పథం ఎలా ఉండాలో స్పష్టం చేస్తున్నాయి. సమాజంలోని పరిస్థితుల పట్ల యువ భారతీయుల అసంతృప్తిని, ఆగ్రహాన్ని శక్తిమంతంగా, వినూత్నంగా వ్యక్తం చేసిన ఉద్యమమది. అయితే సర్వత్రా స్వార్థపరత్వంతో కరడుగట్టిన వ్యవస్థను ఆ 'బొద్దింకల ఉద్యమం' బద్దలుకొడుతుందని ఆశించడం శుద్ధ పొరపాటే అవుతుంది. ఎందుకంటే అదొక అపరిణత రాజకీయ సంస్థ.

## ఈ-క్యాబినెట్‌కు మంత్రివర్గం ఆమోదం

## డిజిటల్ విధానంలోనే ఇకపై మంత్రివర్గ సమావేశాలు



సమయం ప్రతినిధి, హైదరాబాద్ : రాష్ట్ర మంత్రివర్గ సమావేశాలను ఇకపై పూర్తిస్థాయిలో డిజిటల్ విధానంలో నిర్వహించేందుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఈ మేరకు తెలంగాణ డిజిటల్ క్యాబినెట్ వ్యవస్థను అమల్లోకి తీసుకురావాలని ప్రభుత్వం నిర్ణయించింది. గురువారం జరిగిన మంత్రివర్గ సమావేశం సందర్భంగా సమాచార సాంకేతిక శాఖ మంత్రి శ్రీధర్ బాబు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి, ఇతర మంత్రులకు ప్రత్యేక ట్యాబ్‌లను అందజేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి డిజిటల్ క్యాబినెట్ అమలు విధానాన్ని పరిశీలించారు. ఈ విధానం అమల్లోకి వచ్చిన తర్వాత మంత్రివర్గ సమావేశాల ఎజెండాలు, నోట్లు, నిర్ణయాలు, ఫైళ్లు పూర్తిగా డిజిటల్ రూపంలో అందుబాటులో ఉంటాయి. ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, మంత్రులు తమ ట్యాబ్‌లు లేదా కంప్యూటర్ల ద్వారా వాటిని పరిశీలించవచ్చు. అలాగే ఎక్కడి నుంచైనా, ఏ సమయంలోనైనా సంబంధిత సమాచారాన్ని వీక్షించే అవకాశం కలుగుతుంది. వ్యవస్థ భద్రతను దృష్టిలో ఉంచుకుని ప్రతి మంత్రివర్గ సభ్యునికి ప్రత్యేక ప్రవేశ సంకేతపదం, లాగిన్ గుర్తింపును అందించనున్నారు. దీంతో పత్రాల గోప్యత, భద్రత మరింత బలోపేతం కానుంది. 'ఈ-క్యాబినెట్' నిర్వహణ కోసం ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ను ప్రభుత్వం వినియోగించనుంది. ఈ వ్యవస్థ ఏర్పాటుకు సుమారు రూ.2 కోట్ల వ్యయం అవుతుందని రాష్ట్ర సమాచార సాంకేతిక శాఖ అంచనా వేసింది. ఇందులో భాగంగా జాతీయ సమాచార కేంద్రానికి తొలి విడతగా రూ.20 లక్షలు చెల్లించేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చినట్లు సమాచారం.

## వన మహోత్సవానికి ప్రణాళికలు సిద్ధం చేయాలి



నాగర్ కర్నూల్ సమయం ప్రతినిధి : గురువారం కల్వకుర్తి నియోజకవర్గంలోని వెల్దండ మండల పరిధిలోని పెద్దాపూర్, వెల్దండ గ్రామాలలో కలెక్టర్ విస్తృతంగా పర్యటించి గ్రామాభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాల అమలు తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనుల పురోగతిని సమీక్షించి, ప్రజలకు అందుతున్న సేవలపై అధికారులతో చర్చించారు. కల్వకుర్తి నియోజకవర్గంలోని వెల్దండ మండల పరిధిలోని పెద్దాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలో నిర్వహిస్తున్న నర్సరీని సందర్శించిన కలెక్టర్ అక్కడ మొక్కల పెంపకం, సంరక్షణ, నిర్వహణ విధానాలను పరిశీలించారు. నర్సరీలో పెంచుతున్న వివిధ రకాల మొక్కల వివరాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. మొక్కల నాణ్యత, నీటి వసతి, సంరక్షణ చర్యలు, వాటి పంపిణీ విధానాలపై ప్రత్యేకంగా ఆరా తీశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ....... గ్రామాల్లో పచ్చదనం పెంపొందించడంలో నర్సరీల పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణతో పాటు గ్రామాల అందాన్ని పెంచడంలో మొక్కల పెంపకం ముఖ్యమని చెప్పారు. అందువల్ల నాణ్యమైన మొక్కల ఉత్పత్తి, వాటి సంరక్షణ, సరైన సమయంలో పంపిణీ వంటి అంశాలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. నర్సరీలో ప్రస్తుతం సుమారు 3,500 మొక్కలు నాటేందుకు సిద్ధంగా ఉన్నాయని అధికారులు కలెక్టర్‌కు వివరించారు. దీనిపై స్పందించిన కలెక్టర్, త్వరలో నిర్వహించనున్న వన మహోత్సవం కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ఇప్పటి నుంచే సమగ్ర ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు. గ్రామాల్లో విస్తృత స్థాయిలో మొక్కల నాటకం చేపట్టి, ప్రతి గ్రామాన్ని పచ్చదనంతో కళకళలాడేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అదేవిధంగా గ్రామపంచాయతీ కార్యదర్శుల ఆధ్వర్యంలో మొక్కల పంపిణీ కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించాలని, ప్రజలు నాటిన మొక్కలు జీవించేలా వాటి సంరక్షణపై ప్రత్యేక అవగాహన కల్పించాలని తెలిపారు. మొక్కలు నాటడం మాత్రమే కాకుండా వాటిని పరిరక్షించడం కూడా ప్రతి ఒక్కరి బాధ్యత అని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ పర్యటనలో సంబంధిత శాఖల అధికారులు, గ్రామపంచాయతీ సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. కలెక్టర్ సూచనల మేరకు గ్రామాల్లో అభివృద్ధి పనులు, పచ్చదనం కార్యక్రమాలు మరింత వేగవంతంగా అమలు చేయనున్నట్లు అధికారులు తెలిపారు. జిల్లా కలెక్టర్ వెంట కల్వకుర్తి ఆర్డీవో జనార్దన్ రెడ్డి, కల్వకుర్తి మార్కెట్ డైరెక్టర్ కృష్ణ,వెల్దండ తహసీల్దార్ కార్తీక్ కుమార్, ఎంపీడీవో కృష్ణయ్య, ఎంఈవో చంద్రుడు నాయక్, వెల్దండ సర్పంచ్ యాదమ్మ వెంకటయ్య గౌడ్, పెద్దాపూర్ సర్పంచ్ కేశమల్ల అనూష, వివిధ శాఖల అధికారులు, మండల స్థాయి అధికారులు, ఆయా గ్రామాల గ్రామపంచాయతీ ప్రతినిధులు, స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ హయాంలో కొత్త అభివృద్ధి శూన్యం

**బీఆర్ఎస్ హయాంలో చేపట్టిన పనులనే కొనసాగిస్తున్నారు**
**సాగునీటి ప్రాజెక్టును త్వరగా పూర్తి చేసి రైతులను ఆదుకోవాలి**
**నెల్లికల్ లిఫ్ట్ పనులను పరిశీలించిన మాజీ ఎమ్మెల్యే నోముల భగత్**



సమయం ప్రతినిధి, నల్లగొండ : నాగార్జునసాగర్ సమీపంలో నిర్మాణంలో ఉన్న నెల్లికల్ లిఫ్ట్ ఇరిగేషన్ పనులను గురువారం బీఆర్ఎస్ నాగార్జునసాగర్ మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ స్థానిక రైతులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు పనుల పురోగతిని అడిగి తెలుసుకున్న ఆయన, అక్కడ ఉన్న రైతులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం నోముల భగత్ మీడియాతో మాట్లాడుతూ.. ప్రస్తుతం జరుగుతున్న నెల్లికల్ లిఫ్ట్ పనులన్నీ గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే మంజూరై, ప్రారంభించబడినవని గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కొత్తగా జిల్లాలో ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టలేదని ఆయన విమర్శించారు. గత కేసీఆర్ ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా ప్రారంభించిన ప్రాజెక్టులను మాత్రమే ఇప్పుడు కొనసాగిస్తున్నారని ఆరోపించారు. రైతాంగానికి సాగునీరు సకాలంలో అందడం చాలా కీలకమని, అందుకే అధికారులు నెల్లికల్ లిఫ్ట్ పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని నోముల భగత్ డిమాండ్ చేశారు. అభివృద్ధి పనుల్లో రాజకీయాలకు తావుండకూడదని, రైతుల ప్రయోజనాలే పరమావధిగా ప్రభుత్వం పనిచేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

## నషాముక్త భారత్ అభియాన్‌లో ప్రజలు భాగస్వాములు కావాలి

**జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా**

సమయం ప్రతినిధి, మహబూబ్‌నగర్: భారత ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న "నషాముక్త భారత్ అభియాన్ – వికసిత్ భారత్ కి పహచాన్" కార్యక్రమాలను ఈ నెల 17 నుంచి 26 వరకు జిల్లావ్యాప్తంగా నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా తెలిపారు. ఈ సందర్భంగా గురువారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని తన ఛాంబర్‌లో నషాముక్త భారత్ అభియాన్ పోస్టర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. మాదక ద్రవ్యాల నిర్మూలన, ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని ఆమె పేర్కొన్నారు. జిల్లాలోని విద్యార్థులు, యువత, ఉద్యోగులు, సామాన్య ప్రజలు పెద్ద సంఖ్యలో ఈ కార్యక్రమాల్లో పాల్గొని మాదక ద్రవ్యాల వ్యసనాలకు దూరంగా ఉండాలనే సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. సమాజంలో మత్తు పదార్థాల వినియోగంపై అవగాహన పెంపొందించి, నషాముక్త భారత్ అభియాన్ ప్రతిజ్ఞను ప్రతి ఒక్కరూ స్వీకరించాలని పిలుపునిచ్చారు. ఈ



కార్యక్రమంలో సహాయ కలెక్టర్ (శిక్షణలో) సాయి శివాని, జిల్లా సంక్షేమ అధికారి జరీనా బేగం, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి శ్రీనివాసులు, జిల్లా విద్యాశాఖ అధికారి విజయకుమారి తదితరులు పాల్గొన్నారు.

# నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు







- రసీదుల్లో ఇష్టానుసారం నిబంధనల ముద్రణపై ఆగ్రహం
- ప్రభుత్వం సూచించిన వరి వంగడాలనే విక్రయించాలి
- విత్తనాలు, ఎరువుల దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్

**సమయం ప్రతినిధి, జోగులాంబ గద్వాల జిల్లా :** గడువు ముగిసిన, విడిగా ఉండే, నకిలీ విత్తనాలను రైతులకు అంటగడితే సహించేది లేదని, సంబంధిత డీలర్ల పై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ హెచ్చరించారు. గురువారం గద్వాలలోని పాత బస్టాండ్ లో పలు విత్తనాలు, ఎరువుల దుకాణాలను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు కంపెనీలకు చెందిన వివిధ రకాల విత్తనాల ప్యాకెట్లను పరిశీలించారు. వానాకాలం 2026 సీజన్‌కు సంబంధించి వ్యవసాయ శాఖ సూచించిన ఎనిమిది రకాల వరి వంగడాలను మాత్రమే రైతులు సాగు చేయాల్సి ఉన్నందున డీలర్లు వాటిని మాత్రమే విక్రయించాలన్నారు. బిపిటి 5204, ఆర్ఎన్ఆర్ 15048, కేఎన్ఎం 1638, డబ్ల్యూ జిఎల్ 962, డబ్ల్యూజిఎల్ 44, జేజిఎల్ 1798, జైశ్రీరామ్, హెచ్ఎంటి (సోనా) రకాలకు మాత్రమే ప్రభుత్వం ఈ ఏడాది బోనస్ చెల్లించడం జరుగుతుందన్నారు. రైతులు నానో యూరియాను సద్వినియోగం చేసుకునేలా ప్రోత్సహించాలన్నారు. ప్రతి పెస్టిసైడ్, సీడ్స్ దుకాణాల వద్ద స్టాక్ బోర్డ్ లు తప్పనిసరిగా ఏర్పాటు చేసి అందులో సమగ్ర వివరాలను పొందుపరచాలన్నారు. ఆయా రిజిస్టర్లను సక్రమంగా నిర్వహించాలని, రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని దుకాణాలను ప్రభుత్వ నిబంధనల ప్రకారం నడుపుకోవాలని డీలర్లకు సూచించారు. పలువురు డీలర్లు రైతులకు ఇచ్చే రసీదుల్లో ఇష్టానుసారం సొంతంగా నిబంధనలను ముద్రించడంపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయంలో సంబంధిత డీలర్లకు నోటీసులు ఇవ్వాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా గద్వాల పట్టణంలోని ప్రధాన రహదారుల్లో, ముఖ్యమైన కూడళ్లలో ఇష్టానుసారం ఫ్లెక్సీలను ఏర్పాటు చేయడంపై సంబంధిత అధికారులపై జిల్లా కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అనుమతులు లేకుండా ఏర్పాటు చేసే ప్రకటనల బోర్డులను తొలగించాలని, ఫ్లెక్సీల కారణంగా ఇబ్బందులు ఉన్నందున వెంటనే తీసివేయించాలని మున్సిపల్ కమిషనర్ జానకిరామ్ సాగర్ కు సూచించారు. ఈ పర్యటనలో జిల్లా వ్యవసాయశాఖ అధికారి వీరప్ప, మండల వ్యవసాయ అధికారి ప్రతాప్ కుమార్, టెక్నికల్ ఏవోలు చంద్రశేఖర్, భవాని తదితరులున్నారు.

## ప్రజల భద్రతే లక్ష్యంగా ఆర్ఏఎఫ్ బలగాలతో ఫ్లాగ్ మార్చ్ పాల్గొన్న జిల్లా ఎస్పీ డి. జానకి



**సమయం ప్రతినిధి, మహబూబ్‌నగర్ :** ప్రజల భద్రత, శాంతి భద్రతల పరిరక్షణను మరింత బలోపేతం చేయాలనే లక్ష్యంతో మహబూబ్‌నగర్ పట్టణంలోని టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం రాపిడ్ యాక్షన్ ఫోర్స్ (ఆర్ఏఎఫ్) బలగాలతో కలిసి భారీ ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ డి. జానకి స్వయంగా పాల్గొ ని బలగాలను సమీక్షించారు. మహబూబ్‌నగర్ డీఎస్పీ వెంకటేశ్వర్లు, టూ టౌన్ ఇన్‌స్పెక్టర్ ఇజాజుద్దీన్, ఆర్ఏ ఎఫ్ సహాయ కమాండెంట్, ఆర్ఏఎఫ్ సిబ్బంది, పోలీసు అధికారులు, పోలీసు సిబ్బంది ఈ ఫ్లాగ్ మార్చ్‌లో పాల్గొన్నారు. ఓల్డ్ డీఈవో కార్యాలయం, రైల్వే స్టేషన్, ఎర్రసత్యం క్రాస్‌రోడ్, బోయపల్లి గేట్, తెలంగాణ చౌరస్తా, నూతన బస్టాండ్, మల్లికార్జున చౌరస్తా తదితర ప్రధాన ప్రాంతాల్లో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ప్రజా రద్దీ ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో పోలీసులు అప్రమత్తంగా నిఘా కొనసాగిస్తున్నట్లు ఈ సందర్భంగా ప్రజలకు భరోసా కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసు శాఖ అత్యున్నత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ప్రజలు ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా ప్రశాంత వాతావరణంలో జీవించేలా పోలీసు యంత్రాంగం నిరంతరం అప్రమత్తంగా పనిచేస్తోందన్నారు.

## కేశంపేట్ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన పోలీస్ కమిషనర్

**పెండింగ్ కేసుల సత్వర పరిష్కారానికి ఆదేశాలు**



**సమయం ప్రతినిధి, కేశంపేట్ :** ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనర్ డాక్టర్ తరుణ్ జ్యోషి గురువారం కేశంపేట్ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్‌కు చేరుకున్న ఆయన వివిధ విభాగాలను పరిశీలించి, రికార్డుల నిర్వహణ, పెండింగ్ కేసుల దర్యాప్తు పురోగతి, శాంతిభద్రతల పరిస్థితి, ప్రజలకు అందుతున్న సేవలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులు, సిబ్బందితో సమావేశమైన కమిషనర్ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలన్నారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి వ్యక్తితో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, ఫిర్యాదులపై వెంటనే స్పందించాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న కేసులను వేగవంతంగా పూర్తి చేసి బాధితులకు సత్వర న్యాయం అందించాలని ఆదేశించారు. పెరుగుతున్న సైబర్ నేరాల పట్ల ప్రజల్లో అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. మహిళలు, చిన్నారుల భద్రతకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని, గ్రామస్థాయిలో కమ్యూనిటీ పోలీసింగ్‌ను మరింత బలోపేతం చేయాలని సూచించారు. పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు ప్రజలకు పారదర్శకమైన, సమర్థవంతమైన సేవలు అందించడమే లక్ష్యంగా పనిచేయాలని సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. ఈ తనిఖీ కార్యక్రమంలో సంబంధిత డీసీపీ, ఏసీపీ, స్టేషన్ హౌస్ ఆఫీసర్‌తో పాటు ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

## వ్యాపార సంస్థల్లో సీసీటీవీ కెమెరాల ఏర్పాటు భద్రతకు అత్యంత కీలకం-జిల్లా ఎస్పీ డి. జానకి





సమయం ప్రతినిధి, మహబూబ్‌నగర్ : వ్యాపార సంస్థలు, షాపింగ్ కాంప్లెక్స్‌లు, గోదాములు, వాణిజ్య సముదాయాల్లో సీసీటీవీ కెమెరాల ఏర్పాటు భద్రతకు అత్యంత కీలకమని జిల్లా ఎస్పీ డి. జానకి పేర్కొన్నారు. మహబూబ్‌నగర్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓం కన్వెన్షన్ హాల్‌లో గురువారం రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ గాంధీ నాయక్ ఆధ్వర్యంలో వ్యాపారవేత్తలకు సీసీటీవీ కెమెరాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎస్పీ మాట్లాడుతూ, ప్రస్తుత పరిస్థితుల్లో ప్రతి వ్యాపార సంస్థలో సీసీటీవీ కెమెరాల ఏర్పాటు అవసరమని తెలిపారు. నేరాల నివారణ, నేరస్తుల గుర్తింపు, అనుమానాస్పద కదలికల పర్యవేక్షణలో సీసీటీవీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తాయని చెప్పారు. నాణ్యమైన కెమెరాలను సరైన నిల్వ సామర్థ్యంతో ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. వ్యాపార సంస్థలలో ఏర్పాటు చేసిన సీసీటీవీ వ్యవస్థలను జిల్లా పోలీసు నియంత్రణ కేంద్రంతో అనుసంధానం చేయవచ్చని తెలిపారు. దీంతో అత్యవసర పరిస్థితుల్లో పోలీసులు వేగంగా స్పందించే అవకాశం ఉంటుందన్నారు. అలాగే హైదరాబాద్‌లోని సమీకృత ఆదేశాలు, నియంత్రణ కేంద్రంతో అనుసంధానం చేసే దిశగా చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. నగదు లావాదేవీలు జరిగే ప్రాంతాలు, ప్రవేశ ద్వారాలు, వాహనాల నిల్వ ప్రదేశాలు వంటి కీలక ప్రాంతాల్లో తప్పనిసరిగా కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. భద్రతా చర్యల్లో భాగంగా పోలీసు శాఖకు వ్యాపారవేత్తలు సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా వ్యాపారవేత్తలు సీసీటీవీ అనుసంధానం, సాంకేతిక సదుపాయాలపై తమ సూచనలు తెలియజేశారు. పోలీసు శాఖ చేపడుతున్న భద్రతా చర్యలకు పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ గాంధీ నాయక్, రూరల్ సబ్ ఇన్‌స్పెక్టర్ విజయ్ కుమార్, వ్యాపారవేత్తలు, సంస్థల యజమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రాథమికోన్నత పాఠశాలగా మార్చండి

అమరచింత : అమరచింత మండలం కొంకనివాని పల్లి గ్రామ ప్రాథమిక పాఠశాలను ప్రాథమికోన్నత పాఠశాలగా మార్చాలని అమరచింత మండల ఇంచార్జి విద్యాధికారి కృష్ణవేణి కి వినతి పత్రం సమర్పించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొంకనివాని పల్లి గ్రామంలో చాలామంది విద్యార్థులు చదువు తున్నారని ఇక్కడ 5 తరగతి వరకే ఉండడం వల్ల 6,7 తరగతులకు అమరచింత తదితర గ్రామాలకు విద్యార్థులు వెళ్లాల్సి వస్తుందని ఆ సమస్యను పరిష్క రించుటకు ఈ గ్రామంలోనే ఆరు ఏడు తరగతులు ఏర్పాటు చేసి వారికి తగిన ఉపాధ్యాయులను నియ మించగలరని ఆయన ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కొంకనివానిపల్లి గ్రామ విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఉన్ని పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడిగా గడ్డం శ్రీనివాస్ ఏకగ్రీవ ఎన్నిక



**సమయం ప్రతినిధి, షాద్‌నగర్ :** షాద్‌నగర్‌లోని ఉన్ని పారిశ్రామిక సహకార సంఘం మేనేజింగ్ కమిటీ ఎన్నికలు గురువారం ప్రశాంతంగా జరిగాయి. సంఘం అధ్యక్షుడిగా గడ్డం శ్రీనివాస్ (క్యూసెట్ శ్రీను) ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి చంద్రకుమార్ ప్రకటించారు.
ఈ ఎన్నికల్లో ఉపాధ్యక్షుడిగా గోవిందు యాదయ్య (నర్సప్పగూడ), ప్రధాన కార్యదర్శిగా ఎర్ర ఆంజనేయులు (ఎస్‌బి పల్లి), కోశాధికారిగా క్యామ నర్సిములు (షాద్‌నగర్) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అలాగే డైరెక్టర్లుగా కొంగండ్ల పద్మమ్మ (కాకునూర్), గుండ్ల సిద్ధమ్మ (షాద్‌నగర్), గౌర వెంకటయ్య (వీర్లపల్లి), ఎమ్మె వెంకటయ్య (ఎస్‌బి పల్లి), ఎదిర జంగయ్య (బోదునంపల్లి)లు ఎన్నికయ్యారు. నూతన కమిటీ ఎన్నిక సందర్భంగా సంఘ సభ్యులు హర్షం వ్యక్తం చేస్తూ ఎన్నికైన ప్రతినిధులకు శుభాకాంక్షలు తెలిపారు. సంఘ అభివృద్ధి, సభ్యుల సంక్షేమం కోసం సమిష్టిగా కృషి చేస్తామని నూతన కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో డి. నర్సిములు, జంగిలి మల్లయ్య, గడ్డం సుధాకర్, రాజుల యాదయ్య, ఎమ్మె బాలరాజు, ఎమ్మె ధనవంతు, ఎర్ర రవి, పిప్పళ్ల జంగయ్య, ఎదిర వెంకటయ్య, టి. శ్రీనివాస్, క్యామ సురేష్, క్యామ శ్రీశైలం, గడ్డం వెంకటేష్, కేంద్యాల రాజేష్, క్యామ రమేష్, కేంద్యాల శేషు కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# జనరల్ ఆసుపత్రి వైద్య పరికరాల కొనుగోలుకు రూ.2.68 కోట్ల నిధులు

**అవసరాలపై సమగ్ర ప్రతిపాదనలు సిద్ధం చేయాలి**
**జిల్లా ఆసుపత్రి అభివృద్ధి కమిటీ**
**తొలి సమావేశంలో కీలక నిర్ణయాలు**
**జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్**






**నాగర్ కర్నూల్ సమయం ప్రతినిధి:** నాగర్‌కర్నూల్ జిల్లా ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించేందుకు నాగర్‌కర్నూల్ జిల్లా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిని అన్ని విధాలుగా అభివృద్ధి చేసే దిశగా చర్యలు వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ అధికారులను ఆదేశించారు. జిల్లా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ తొలి సమీక్ష సమావేశం గురువారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ అధ్యక్షతన నిర్వహించగా, ఆసుపత్రిలో అందుతున్న సేవలు, మౌలిక సదుపాయాలు, వైద్య పరికరాల అవసరాలు, భవిష్యత్ అభివృద్ధి కార్యక్రమాల పై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సమావేశంలో జిల్లా ఆసుపత్రి ప్రస్తుత పరిస్థితి, రోగుల రద్దీ, అందుబాటులో ఉన్న వైద్య సేవలు, వివిధ విభాగాల్లో అవసరమైన ఆధునిక పరికరాల ఏర్పాట్లపై కమిటీ కన్వీనర్ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఉషారాణి పూర్తిస్థాయి వివరాలను కమిటీకి వివరించారు. అనంతరం ఆసుపత్రి అభివృద్ధికి అవసరమైన చర్యలపై కలెక్టర్ సమగ్ర సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ మాట్లాడుతూ...., జిల్లా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ఆధునిక వైద్య సేవలను మరింత విస్తరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా రూ.2 కోట్ల 68 లక్షల 79 వేల 383 రూపాయలను మంజూరు చేసిందని, ఈ నిధులతో ఆసుపత్రికి అత్యవసరంగా అవసరమైన వైద్య పరికరాలు, నిర్ధారణ యంత్రాలు, రోగుల చికిత్సకు ఉపయోగపడే ఆధునిక ఎక్విప్‌మెంట్‌ను కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు. నిధుల వినియోగంలో ఎలాంటి నిర్లక్ష్యం చోటు చేసుకోకుండా, ఆసుపత్రిలో ప్రస్తుతం ఉన్న అవసరాలను గుర్తించి ప్రాధాన్యత క్రమంలో ప్రతిపాదనలు సిద్ధం చేయాలని జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఉషారాణికి సూచించారు. ప్రతి విభాగం నుంచి అవసరాల జాబితాను సేకరించి, సాంకేతిక నివేదికలతో కూడిన సమగ్ర ప్రతిపాదనలను అత్యవసరంగా సమర్పించాలని ఆదేశించారు. జిల్లా ప్రజలు మెరుగైన వైద్య సేవల కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా అన్ని రకాల వైద్య సదుపాయాలు జిల్లా కేంద్రంలోనే అందుబాటులోకి తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమని, ముఖ్యంగా అత్యవసర వైద్యం, నిర్ధారణ సేవలు, ప్రసూతి వైద్యం, శస్త్రచికిత్సలు, ఐసీయూ సేవల బలోపేతానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఆసుపత్రిలో రోగులకు అందుతున్న సేవల నాణ్యతను మరింత మెరుగుపర్చాలని, వైద్యులు, సిబ్బంది రోగుల పట్ల బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, ఆసుపత్రికి వచ్చే ప్రతి రోగికి సకాలంలో చికిత్స అందేలా చర్యలు తీసుకోవాలని, అవసరమైన మందులు, పరికరాలు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా చూడాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న నిధులను పారదర్శకంగా వినియోగించి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కృషి చేయాలని సమావేశంలో పాల్గొన్న అధికారులకు కలెక్టర్ సూచించారు. ఆసుపత్రికి అంబులెన్స్ లేదని కలెక్టర్ దృష్టికి సూపరింటెండెంట్ తీసుకొని రాగా, రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో ఉన్న అంబులెన్స్ను ఆసుపత్రికి అందజేయాలని వాటి మరమ్మత్తులకు జిల్లా కలెక్టర్ నేరుగా నిధులు అందజేస్తానని కలెక్టర్ హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో నాగర్ కర్నూల్ మున్సిపల్ చైర్మన్ తీగల సునేంద్ర,జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ టి ఉషారాణి, జిల్లా మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ మహమ్మద్ దావూద్ సులేమాన్, డాక్టర్ శంకర్, డాక్టర్ సుప్రియ, డాక్టర్ రఘు, హరిత, సాయిబాబు, రాధాకృష్ణ, కవిత, పోతుల శిరీష, డాక్టర్ కృష్ణ, డాక్టర్ రామకృష్ణ , అభివృద్ధి కమిటీ సభ్యులు, డాక్టర్ కోటేశ్వర్, డాక్టర్ రవి నాయక్, వివిధ విభాగాల వైద్యాధికారులు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, ఆసుపత్రి పరిపాలనా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## హైదరాబాద్‌లో భారీ వర్షం.. పలు ప్రాంతాలు జలమయం

మొదటి పేజీ తరువాయి



హైదరాబాద్ : భాగ్యనగరంలో గురువారం భారీ వర్షం కురవడంతో జనజీవనం అస్తవ్యస్తమైంది. పలుచోట్ల రహదారులు నీటమునిగిపోగా, లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. వర్షపు నీరు రోడ్లపై నిల్వ ఉండటంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.
నగరంలోని పంజాగుట్ట, బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, ఫిలింనగర్, టోలిచౌకి, యూసఫ్‌గూడ, నల్లగండ్ల ప్రాంతాల్లో వర్షం కురుస్తోంది. భారీ వర్షం కారణంగా ప్రధాన రహదారులపై ట్రాఫిక్ జాం నెలకొంది. ముఖ్యంగా ఐటీ కారిడార్ ప్రాంతాల్లో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. వర్షపు నీరు కాలనీల్లోకి చేరడంతో కొన్ని లోతట్టు ప్రాంతాలు నీట మునిగాయి. అధికారులు పరిస్థితిని పర్యవేక్షిస్తూ, అవసరమైన చోట్ల సహాయక చర్యలు చేపడుతున్నారు. హైదరాబాద్‌తో పాటు పరిసర ప్రాంతాల్లో మరికొన్ని గంటల పాటు మోస్తరు నుంచి తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ శాఖ అధికారులు సూచించారు. ప్రజలు అత్యవసరమైతేనే బయటకు రావాలని, నీటితో నిండిన రహదారులపై జాగ్రత్తగా ప్రయాణించాలని అధికారులు పేర్కొన్నారు.

## దేవతల ప్రతిష్ఠాపన పూజల్లో పాల్గొన్న ఆల వెంకటేశ్వర్ రెడ్డి



**సమయం ప్రతినిధి, దేవరకద్ర :** దేవరకద్ర నియోజకవర్గంలోని అడ్డాకుల మండలం సుంకరాం పల్లి గ్రామంలో శ్రీశ్రీశ్రీ భులింగేశ్వర (బొడ్రాయి), పోచమ్మ, రాయకంటి ఎల్లమ్మ దేవతల బలిపీఠం, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన పూజా కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆల వెంకటేశ్వర్ రెడ్డి దేవతల ఆశీస్సులతో గ్రామ ప్రజలు సుఖశాంతులు, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. గ్రామ అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం ప్రతి ఒక్కరూ ఐక్యంగా కృషి చేయాలని సూచించారు. గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు, ప్రజాప్రతినిధులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## జూన్ 30న రైతు భరోసా నిధుల విడుదల
## కేబినెట్ సమావేశంలో నిర్ణయం

**సమయం ప్రతినిధి, హైదరాబాద్ :** రైతు భరోసా పథకం కింద నిధులను జూన్ 30వ తేదీన విడుదల చేయాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. గురువారం సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరిగిన మంత్రివర్గ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. రైతు భరోసా నిధులను వరుసగా తొమ్మిది రోజుల పాటు రైతుల ఖాతాల్లో జమ చేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. జూన్ 20న ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని మధిరలో నిర్వహించే సభలో రైతు భరోసా నిధుల విడుదల కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి ప్రారంభించనున్నట్లు సమాచారం. ఇదిలా ఉండగా, కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి యోజన కింద 23వ విడత నిధులను కూడా జూన్ 30న విడుదల చేయనుంది. పశ్చిమ బెంగాల్‌లోని హుగ్లీ జిల్లా తారకేశ్వర్‌లో జరిగే కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోదీ రైతుల ఖాతాల్లో నిధులను జమ చేయనున్నారు. ఈ పథకం కింద ఒక్కో రైతు ఖాతాలో రూ.2 వేల చొప్పున జమ కానుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వచ్చే ఈ ఆర్థిక సాయం రైతులకు ఉపశమనం కలిగించనుందని రైతు సంఘాల ప్రతినిధులు అభిప్రాయపడుతున్నారు.

## సిబ్బంది లేక మూతపడుతున్న అంగన్‌వాడీ కేంద్రాలు: గద్వాల జిల్లాలో చిన్నారుల అవస్థలు




**సమయం ప్రతినిధి, జోగులాంబ గద్వాల జిల్లా :** జోగులాంబ గద్వాల జిల్లాలోని పలు అంగన్‌వాడీ కేంద్రాలు టీచర్లు, ఆయాలు (హెల్పర్లు) లేకపోవడంతో మూతపడుతున్నాయి. దశాబ్దాలుగా గ్రామీణ ప్రాంతాల్లో గర్భిణులు, బాలింతలు మరియు చిన్నారులకు పోషకాహారం, ముందస్తు ప్రాథమిక విద్యను అందించడంలో కీలక పాత్ర పోషిస్తున్న అంగన్‌వాడీ వ్యవస్థ, ప్రస్తుతం సిబ్బంది కొరతతో తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయింది.

**తాళాలు పడిన కేంద్రాలు - ఆందోళనలో తల్లిదండ్రులు**

జిల్లాలోని పలు మండలాల్లో అంగన్‌వాడీ కార్యకర్తలు రిటైర్ అవ్వడం, ఇతర కారణాల వల్ల పోస్టులు ఖాళీగా ఏర్పడ్డాయి. చాలా కేంద్రాల్లో ఆయాతో నెట్టుకొస్తున్నారు. చాలా కేంద్రాలకు తాళాలు పడ్డాయి. ఫలితంగా రోజూ ఉదయాన్నే కేంద్రాలకు వచ్చే చిన్నారి పిల్లలు వెనుతిరగాల్సి వస్తోంది.

**పెరిగిన అదనపు భారం**

కొన్ని ప్రాంతాల్లో ఒకే టీచర్ పక్కపక్క గ్రామాల్లోని రెండు, మూడు కేంద్రాలను ఇన్‌ఛార్జ్‌గా చూసుకోవాల్సి వస్తోంది. దీనివల్ల ఏ ఒక్క కేంద్రంపైనా పూర్తిస్థాయి పర్యవేక్షణ ఉండటం లేదు. ఆయాలు లేని కేంద్రాల్లో శుభ్రత లోపించడమే కాకుండా, చిన్న పిల్లలను చూసుకోవడం టీచర్లకు పెద్ద భారంగా మారింది.

**నోటిఫికేషన్ కోసం ఎదురుచూపులు**

తెలంగాణ వ్యాప్తంగా అంగన్‌వాడీల్లో దాదాపు 22 శాతానికి పైగా పోస్టులు ఖాళీగా ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వం తొలి విడతలో 5 వేలకు పైగా పోస్టుల భర్తీకి గ్రీన్ సిగ్నల్ ఇచ్చినప్పటికీ, క్షేత్రస్థాయిలో నియామక ప్రక్రియ వేగవంతం కాకపోవడంతో గద్వాల జిల్లాలోని కేంద్రాలు వెలవెలబోతున్నాయి

**ప్రజల డిమాండ్:**

గద్వాల జిల్లా యంత్రాంగం మరియు మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారులు తక్షణమే స్పందించి, తాత్కాలిక ప్రాతిపదికనైనా సిబ్బందిని నియమించి మూతపడిన అంగన్‌వాడీ కేంద్రాలను పునఃప్రారంభించాలని స్థానిక ప్రజలు మరియు విద్యార్థి సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

## బాలికా విద్యతోనే సమాజాభివృద్ధి

### కేజీబీవీ విద్యార్థినులకు జిల్లా విద్యాశాఖ అధికారి విజయ్ కుమారి పిలుపు



సమయం ప్రతినిధి, మహబూబ్‌నగర్: మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ఏనుగొండలో ఉన్న కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయాన్ని జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీమతి ఐ. విజయ్ కుమారి సందర్శించారు. బడిబాట కార్యక్రమం లో భాగంగా నిర్వహించిన బాలికా విద్య, వృత్తి మార్గదర్శకత్వ కార్యక్రమంలో పాల్గొని విద్యార్థినులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలబాలికల జనన నిష్పత్తి, అక్షరాస్యతలో ఇంకా వ్యత్యాసాలు ఉన్నందున ప్రభుత్వం బాలికా విద్యకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. విద్యార్థినులు తమకు ఆసక్తి ఉన్న రంగాన్ని ఎంచుకుని లక్ష్యసాధన దిశగా కృషి చేయాలని సూచించారు. కేవలం డిగ్రీలు సాధించడం సరిపోదని, నేటి అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాలు, సాంకేతిక పరిజ్ఞానం, సంభాషణ సామర్థ్యాలను పెంపొందించుకోవాలని తెలిపారు. సమస్యలు ఎదురైనప్పుడు ధైర్యం, ఆత్మవిశ్వాసంతో వాటిని అధిగమించాలని, ఉన్నత స్థానాలకు చేరుకుని బాలికా విద్యకు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. లింగ వివక్షను ఖండిస్తూ ఇతర బాలికల అభివృద్ధికి సహకరించాలని కోరారు. అంతకుముందు పాఠశాలలోని తరగతి గదులు, వంటగది, ప్రయోగశాల, పరిసరాలను పరిశీలించిన జిల్లా విద్యాశాఖ అధికారి, పాఠశాలలోని విద్యా వాతావరణం, ఫలితాలపై సంతృప్తి వ్యక్తం చేశారు. మంచి ఫలితాలు సాధించిన ప్రత్యేక అధికారి, సీఆర్టీలు, పీజీసీఆర్టీలను అభినందించారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష జీఈసీఓ అస్రా ఖాద్రి తదితరులు పాల్గొన్నారు.

## నీటిని విడుదల చేసిన ఎమ్మెల్యే జిఎంఆర్



దేవరకద్ర : చిన్న చింతకుంట మండలం ఉంద్యాల గ్రామ సమీపంలోని ఉంద్యాల పంప్ హౌస్ స్టేజ్ - 1 నుండి మండల నాయకులు, అధికారులతో కలసి దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి కోయిల్ సాగర్ కు నీటిని విడుదల చేశారు. అనంతరం ఎమ్మెల్యే జియంఆర్ మాట్లాడుతూ జూరాల నుంచి ఉంద్యాల పంప్ హౌస్ పేజ్ - 1 నుంచి లిఫ్ట్ ద్వారా కోయిల్ సాగర్ కు నీటిని విడుదల చేయడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు, కాంగ్రెస్ ప్రభుత్వం లో నిర్మించిన ప్రాజెక్టుల వల్లనే ఉమ్మడి పాలమూరు జిల్లాలో రైతాంగానికి సాగునీరు, తాగునీరు అందుతుందని తెలియజేసారు, గత ప్రభుత్వంలో బిఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ పార్టీ నిర్మించిన ప్రాజెక్టుల నీళు వదిలి, పూలు చల్లారే తప్ప, బిఆర్ఎస్ పాలనలో గత పదేళ్లలో కృష్ణానది నుంచి పాలమూరుకు అదనంగా చుక్క నీరు తీసుకు రాలేదన్నారు.

# వార్షిక తనిఖీలలో భాగంగా పెద్దమందడి పోలీస్‌స్టేషన్ తనిఖీ : జిల్లా ఎస్పీ








(సమయం ప్రతినిధి వనపర్తి )పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుదారుడు పోలీసు శాఖ తనకు అండగా ఉందనే నమ్మకంతో తిరిగి వెళ్లాలి. బాధితులకు న్యాయం చేయడం, ప్రజలకు భద్రత కల్పించడం, నేరాల నియంత్రణలో సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థంగా వినియోగించడం ప్రతి పోలీసు అధికారికి ప్రధాన బాధ్యతని జిల్లా ఎస్పీ శ్రీమతి సునిత రెడ్డి, అన్నారు గురువారం రోజు వనపర్తి జిల్లా పరిధిలోని పెద్దమందడి పోలీస్‌స్టేషన్ " వార్షిక తనిఖీలలో " భాగంగా వనపర్తి జిల్లా ఎస్పీ శ్రీమతి లిసునిత రెడ్డి, సందర్శించి తనిఖీ చేశారు. ముందుగా పోలీస్‌స్టేషన్ చేరుకున్న ఎస్పీ కి పోలీసు అధికారులు పూల మొక్కలందజేసి స్వాగతం పలికారు. పోలీసుల గౌరవ వందనం స్వీకరించి పోలీస్‌స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం పోలీస్ స్టేషన్ ఆవరణలో వాహనాల పార్కింగ్ ప్రదేశాలు, రిసెప్షన్, స్టేషన్ రైటర్, టెక్ టీమ్, ఎస్ హెచ్ వో, మెన్ రెస్ట్ రూమ్ , లాక్ అప్ రూమ్ ను తదితర ప్రదేశాలను పరిశీలించారు. స్టేషన్ లో రోజు వారీగా నిర్వహిస్తున్న జనరల్ డైరీ,సెంట్రీ రిలీఫ్ బుక్, డ్యూటీ రోస్టర్, విలేజ్ రోస్టర్, ప్రాసెస్ రిజిస్టర్, బీట్ డ్యూటీ బుక్స్, సస్పెక్ట్ చెక్ రిజిస్టర్, సుపీరియర్ ఆఫీసర్స్ విసిటింగ్ బుక్స్, ఫైనల్ రిపోర్ట్స్ తదితర రికార్డ్స్ ను క్షుణ్ణంగా పరిశీలించారు. పోలీస్‌స్టేషన్ పరిధిలో ఎక్కువగా ఎలాంటి నేరాలు జరుగుతున్నాయి, పెండింగ్ లో ఉన్న కేసులు, దర్యాప్తు వివరాలను పెద్దమందడి ఎస్సై,జలంధర్ రెడ్డి ని అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ...పెద్దమందడి పోలీస్‌స్టేషన్ పరిధిలో గంజాయి, మట్కా, పేకాట లాంటి అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా పర్యవేక్షించాలన్నారు. సాయంత్రం సమయాలలో డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు నిర్వహిస్తూ రోడ్డు ప్రమాదాలను అరికట్టాలన్నారు. ముఖ్యంగా కేసుల దర్యాప్తునందు నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ సరైన సమయంలో దర్యాప్తు చేసి కోర్టుల నందు చార్జిషీటు దాఖలు చేసినప్పుడు బాధితులకు సరైన న్యాయం జరుగుతుందని తెలిపారు. దీర్ఘ కాలికంగా పెండింగ్లో ఉన్న కేసుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు.

పోలీసు సిబ్బంది మాట్లాడుతూ పోలీసుశాఖ అందించిన కిట్ ఆర్టికల్స్ ను పరిశీలించి వాటిని జాగ్రత్తగా ఉంచుకోవాలని తెలిపారు. అలాగే సిబంది నిర్వహిస్తున్న విధులు, పని తీరు, వారికీ ఏదైనా సమస్యలు ఉన్నాయ అని తెలుసుకుని ఏమైనా సమస్యలు ఉంటే నా దృష్టికి తీసుకురావాలనని స్టేషన్ పరిధిలో ఎలాంటి నేరాలు అధికంగా జరుగుతున్నాయి అడిగి తెలుసుకొని గ్రామ పోలీస్ అధికారులు గ్రామాలను పూర్తిగా సమాచారం సేకరించి నేరాలు నిర్మూలించాలని తెలిపారు.

విలేజ్ పోలీసు అధికారులు తమకు కేటాయించిన గ్రామాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, గ్రామ పెద్దలు, యువతతో సత్సంబంధాలు కొనసాగిస్తూ శాంతిభద్రతలకు సంబంధించిన ముందస్తు సమాచారాన్ని సేకరించాలని తెలిపారు. స్టేషన్ పరిధిలోని రౌడీ షీటర్లు, సస్పెక్ట్ హిస్టరీ షీటర్ల వివరాలను పరిశీలిస్తూ, వాటిని ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని ఆదేశించారు. పగలు, రాత్రి బీట్ విధులలో భాగంగా అనుమానిత వ్యక్తుల వేలిముద్రలను పాపిలాన్ డివైస్ ద్వారా తనిఖీ చేసి, పాత నేరస్తులను గుర్తించాలని సూచించారు. తెలంగాణ రాష్ట్ర పోలీస్ శాఖ అందుబాటులోకి తీసుకువచ్చిన సీసీటీఎన్ఎస్–2.0, పిటిషన్ మేనేజ్‌మెంట్ సిస్టమ్, టీఎస్–కాప్, హెచ్ఆర్ఎంఎస్, ఈ–సాక్ష్య, టెక్ డాటం, ఐరాడ్ దర్పణ్, సీఈఐఆర్, సైబర్ క్రైమ్ పోర్టల్, సీడీఆర్, పోర్టబుల్ ఫింగర్ ప్రింట్ డివైస్ వంటి సాఫ్ట్‌వేర్ అప్లికేషన్లపై పూర్తి స్థాయి పట్టు సాధించి, నేరాల నియంత్రణలో సమర్థవంతంగా వ్యవహరించాలని సిబ్బందికి సూచించారు. స్టేషన్ రికార్డులైన పార్ట్–1 నుండి పార్ట్–5 వరకు ఎలాంటి పెండింగ్ లేకుండా సీసీటీఎన్ఎస్–2.0లో ఎప్పటికప్పుడు నమోదు చేయాలని ఆదేశించారు. అలాగే సిబ్బందికి వర్టికల్ వారీగా విధులు కేటాయించాలని ఎస్సైకి సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు సమర్థవంతమైన చర్యలు తీసుకోవాలని, అధిక రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతాలను బ్లాక్ స్పాట్లుగా గుర్తించి సైన్ బోర్డులను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. జాతీయ రహదారిని ఆనుకొని ఉన్న గ్రామాలలో రోడ్డు ప్రమాదాలపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.

అనంతరం సిబ్బందితో మాట్లాడుతూ, మారుతున్న సమాజానికి అనుగుణంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని, సిబ్బంది ప్రతి ఒక్కరూ అన్ని రకాల విధులపై అవగాహన కలిగి ఉండాలని అన్నారు. ప్రస్తుతం నేర్చుకుంటున్న పనితీరు మీ సేవా కాలమంతా ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేయాలని, ప్రతి ఒక్కరూ తమకు కేటాయించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించినప్పుడే పోలీస్ శాఖకు మంచి పేరు వస్తుందని అన్నారు. డ్యూటీ పరంగా లేదా వ్యక్తిగతంగా ఎలాంటి సమస్యలు ఉన్నా నేరుగా తన దృష్టికి తీసుకురావచ్చని తెలిపారు. వాహనాలు నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించాలని సూచిస్తూ, హెల్మెట్ ధరించని సిబ్బందిని విధుల్లోకి అనుమతించకూడదని అధికారులకు సూచించారు.పోలీస్ స్టేషన్ నిర్వహణ, రికార్డుల నిర్వహణ సంతృప్తికరంగా ఉన్నాయని పేర్కొంటూ అధికారులు, సిబ్బందిని జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.అనంతరం పెద్దమందడి ఎస్సై,జలంధర్ రెడ్డి జన్మదిన సందర్భంగా ఎస్పీ పోలీస్ స్టేషన్లో అధికారుల సిబ్బందితో కలిసి కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. అదేవిధంగా పోలీస్ స్టేషన్ ఆవరణంలో ఏర్పాటు చేసిన వాలీబాల్ కోర్టును ప్రారంభించి పాఠశాల విద్యార్థులతో వాలీబాల్ ఆడారు ఈ వార్షిక తనిఖీ కార్యక్రమంలో వనపర్తి డిఎస్పీ, గిరిబాబు ,కొత్తకోట సీఐ,రాంబాబు , పెద్దమందడి ఎస్సై,జలంధర్ రెడ్డి , డిసిఆర్బి ఎస్సై, తిరుపతి రెడ్డి,పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ ఉద్యోగి కుటుంబానికి మాజీ మంత్రి పరామర్శ



(సమయం ప్రతినిధి వనపర్తి) : రేవల్లి మండల కేంద్రానికి చెందిన విద్యుత్ సహాయకుడిగా పనిచేస్తున్న కాళ్ళ లక్ష్మణ్ గ్రామానికి చెందిన రైతు పొలంలో విద్యుత్ తీగలు సరిచేస్తుండగా అనుకోకుండా విద్యుత్ షాక్ కొట్టి మృతి చెందాడు. ఈ సందర్భంగా లిమాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. మృతుడి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, ఈ విషాదాన్ని తట్టుకునే మనోధైర్యాన్ని కుటుంబ సభ్యులకు భగవంతుడు ప్రసాదించాలని ఆకాంక్షించారు. అదేవిధంగా గ్రామానికి చెందిన అనారోగ్యముగా మాజీ వార్డు మెంబెర్ ముష్టి నిరంజన్ మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి పలకరించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రివెంట నాయకులు శివరాం రెడ్డి, భాస్కర్ రెడ్డి,అబ్బాస్ , కాళ్ళ కుర్మయ్య, కాళ్ళ శివ, ఆనంద్, ముష్టి శివ, ఉప సర్పంచ్ సుధాకర్ రెడ్డి, వార్డు మెంబెర్స్ రాము, కృష్ణ, కార్యకర్తలు, కుటుంబ సభ్యులు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ అబద్ధపు హామీలు - ఇందిరమ్మ ఇండ్లతో న్యాయం చేస్తున్నాం: ప్రభుత్వ విప్

**(సమయం ప్రతినిధి మహబూబ్నగర్) :** గత బిఆర్ఎస్ పాలనలో డబుల్ బెడ్రూం ఇళ్ల పేరుతో గత పది సంవత్సరాలుగా అబద్ధపు హామీలు ఇచ్చి ప్రజలను మోసగించారని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డిలి బిఆర్ఎస్ పైన ఫైర్ అయ్యారు. మహబూబ్ నగర్ నియోజకవర్గంలోని రామచంద్రాపురం గ్రామంలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇండ్లను (వీ+చీ=జు+నా) నిధులు రూ.5 లక్షలతో నిర్మించిన సిసి రోడ్డును ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ, ప్రజలకు సేవ చేయడానికే ప్రజల ఆశీర్వాదంతో తాము అధికారంలోకి వచ్చామని, అందుకే, ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని చెప్పారు. గ్రామాల్లో మౌలిక వసతుల అభివృద్ధి, విద్య మరియు వైద్య రంగాలపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు పేర్కొన్నారు. అదేవిధంగా, రేషన్ కార్డు కలిగిన ప్రతి కుటుంబానికి సన్నబియ్యం పంపిణీ, నూతన రేషన్ కార్డుల జారీ, ఇందిరమ్మ జీవిత భీమా, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రైతులకు రుణమాఫీ, పంటలకు గిట్టుబాటు ధర కల్పించడం వంటి చర్యలు తీసుకున్నామని తెలిపారు. సన్న వడ్లు పండించిన రైతులకు బోనస్ ఇవ్వడమే కాకుండా, గృహ అవసరాల కోసం 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తున్నామని చెప్పారు.

ప్రభుత్వ పాఠశాలలకు కొత్త ఊపిరి తీసుకువచ్చామని, నాణ్యమైన విద్య అందించాలనే లక్ష్యంతో ఉపాధ్యాయుల ఖాళీలను భర్తీ చేస్తున్నామని తెలిపారు. తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ స్థాపన ద్వారా రాష్ట్రాన్ని విద్యలో



దేశంలోనే అగ్రస్థానంలో నిలపాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు పేర్కొన్నారు. ప్రతి ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు ఉచితంగా "యంగ్ ఇండియా స్టూడెంట్ కిట్" అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, గ్రామ సర్పంచ్ నర్సింహులు, ఉప సర్పంచ్ కేశవనంద్, నాయకులు రామచంద్రయ్య, శ్రీనివాస్ యాదవ్, వీరన్న, రాఘవేందర్ గౌడ్, పెంటయ్య, లక్ష్మయ్య, కోడూరు రవి, పాండు, గోవింద్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

## సిపిఎం నేతలతో మాజీ మావోయిస్టుల భేటీ

హైదరాబాద్ : ఎంబీ భవన్‌లో సీపీఐ(ఎం) నేతలతో మాజీ మావోయిస్టుల భేటీ ప్రజాసమస్యలపై కలిసి పనిచేద్దామని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ అన్నారు. ప్రజలు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారనీ, దోపిడీకి గురవుతున్నారని చెప్పారు. సమస్యలపై జరిగే పోరాటాల్లో భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు. గురువారం హైదరాబాద్‌లోని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యాలయం ఎంబీ భవన్‌లో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీతోపాటు ఆ పార్టీ ప్రతినిధులతో మాజీ మావోయిస్టులు దేవ్‌జీ, రాజిరెడ్డి, చంద్రన్న, పద్మక్క, సంజీవ్, బండి ప్రకాశ్ భేటీ అయ్యారు. తాజా రాజకీయ పరిణామాల గురించి సుమారు రెండు గంటలకుపైగా చర్చించారు. అనంతరం మీడియాతో జాన్‌వెస్లీ మాట్లాడుతూ దేశంలో మావోయిస్టులను ఏరివేయడానికి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఆపరేషన్ కగార్‌ను నిరంకుశంగా చేపట్టిందని విమర్శించారు. నరమేధాన్ని కొనసాగించిందని చెప్పారు. సీపీఐ(ఎం), ఇతర వామపక్ష? పార్టీలు, ప్రజాస్వామిక వాదులు కేంద్ర ప్రభుత్వ తీరును ఖండించారని అన్నారు. మావోయిస్టు పార్టీ నుంచి బయటకొచ్చిన వారు ప్రజాఉద్యమాల్లో నిలబడి ముందుకు రావాలని కోరారు. వారి మీద ఉండే ఆంక్ష?లను ఎత్తేయాలని సూచించారు. ఇంకా మిగిలిపోయిన మావోయిస్టులపై నిర్బంధాన్ని కొనసాగించొద్దని డిమాండ్ చేశారు. సామరస్యంగా సమస్య పరిష్కారానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రజా సమస్యలు పెరుగుతున్నాయనీ, పెట్టుబడిదారులు పెద్దఎత్తున దోపిడీ చేస్తున్నారని విమర్శించారు. వాటికి వ్యతిరేకంగా అనేక ఉద్యమాలు ముందుకొస్తున్నాయని చెప్పారు. సామాజిక న్యాయం కోసం, అణగారిన వర్గాల హక్కుల కోసం, మతోన్మాదానికి, దోపిడీ వర్గాలకు వ్యతిరేకంగా జరిగే పోరాటంలో ప్రజలు భాగస్వాములు కావాలని కోరారు. కలిసొచ్చే వారిని సీపీఐ(ఎం) ఆహ్వానిస్తుందని చెప్పారు. ఆపరేషన్ కగార్ సందర్భంగా వామపక్ష?లు, కాంగ్రెస్, ప్రజాస్వామికవాదులు ఆ నిర్బంధాన్ని వ్యతిరేకించాయని గుర్తు చేశారు. ఆ పార్టీలను కలవడంలో భాగంగానే వారు ఇక్కడికి వచ్చారని చెప్పారు. ప్రజా ఉద్యమాల్లో కలిసి పనిచేద్దామని అన్నారు. ఇందులో రాజకీయ అంశాలకు ప్రాధాన్యత లేదని వివరించారు.

**మర్యాదపూర్వకంగానే కలిశాం : దేవ్‌జీ**

ఆపరేషన్ కగార్‌ను ఆపాలనీ, కర్రెగుట్టలో నిర్బంధం తొలగించాలనీ, మావోయిస్టులతో కేంద్ర ప్రభుత్వం శాంతి చర్చలు జరపాలని వామపక్ష? పార్టీలు, శాంతి చర్చల కమిటీ, ప్రజాసంఘాలు కోరాయని మాజీ మావోయిస్టు దేవ్‌జీ అన్నారు. పలు ఉద్యమాలను కూడా నడిపారని వివరించారు. తాము ప్రజా జీవితంలోకి వచ్చాక ఆపరేషన్ కగార్‌ను ఆపాలన్న రాజకీయ పార్టీల నాయకులను అందరినీ కలవాలనే కార్యక్రమం తీసుకున్నామని చెప్పారు. ఇటీవల సీపీఐ



కార్యాలయానికి వెళ్లామనీ, ఇప్పుడు సీపీఐ(ఎం) కార్యాలయానికి వచ్చామని అన్నారు. రాజకీయ పరిస్థితుల గురించి మాట్లాడుకున్నామని చెప్పారు. అయితే రాజకీయ పార్టీ స్థాపించడం గురించి మాట్లాడ్డం ఇది సందర్భం కాదన్నారు. ఏ పార్టీలో చేరడం లేదనీ. ఈ విషయాలు చర్చించుకోవడానికి ఇది సరైన సందర్భం కాదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి, పోతినేని సుదర్శన్‌రావు, టి సాగర్, ఎండీ అబ్బాస్, సీనియర్ నాయకులు జి రాములు, రాష్ట్ర కమిటీ సభ్యులు ఆర్ శ్రీరాం నాయక్, టి స్కైలాబ్‌బాబు, మల్లు నాగార్జునరెడ్డి, పి ఆశయ్య, ఉడుత రవీందర్, నాయకులు ధర్మానాయక్, కోట రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సమయం
శుక్రవారం 19 జూన్ 2026

# రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పారదర్శకంగా యూరియా సరఫరా చేయాలి





నాగర్ కర్నూల్ సమయం ప్రతినిధి : రైతులకు యూరియా సరఫరాను మరింత పారదర్శకంగా, సులభతరంగా అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన యూరియా బుకింగ్ యాప్ జిల్లాలో నేటి నుంచి అందుబాటులోకి వచ్చిన నేపథ్యంలో, ఆ యాప్ అమలు తీరును ప్రత్యక్షంగా పరిశీలించేందుకు నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ గురువారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా నాగర్‌కర్నూల్ మున్సిపల్ పరిధిలోని దేశీటిక్యాల కొల్లాపూర్ చౌరస్తాలో ఉన్న ఇన్ఫో బజార్ క్రిమిసంహారక మందుల దుకాణాన్ని సందర్శించి యూరియా నిల్వలు, పంపిణీ విధానం, యాప్ వినియోగం, రైతులకు అందుతున్న సేవలపై సమగ్రంగా ఆరా తీశారు. దుకాణానికి చేరుకున్న కలెక్టర్ ముందుగా క్రిమిసంహారక మందుల దుకాణానికి సంబంధించిన లైసెన్సులను పరిశీలించారు. లైసెన్సులు చెల్లుబాటులో ఉన్నాయా, ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలను పాటిస్తున్నారా అనే అంశాలపై వివరాలు తెలుసుకున్నారు. అనంతరం దుకాణంలో అందుబాటులో ఉన్న యూరియా నిల్వలను పరిశీలించి, ప్రస్తుతం ఉన్న స్టాక్, రైతులకు పంపిణీ చేసిన పరిమాణం, భవిష్యత్తు అవసరాలకు సరిపడా నిల్వలు ఉన్నాయా అనే విషయాలపై నిర్వాహకులను ప్రశ్నించారు. యూరియా బుకింగ్ యాప్ ద్వారా రైతులు చేసుకున్న బుకింగ్‌ల ఆధారంగా పంపిణీ ఎలా జరుగుతోందో ప్రత్యక్షంగా పరిశీలించేందుకు కలెక్టర్ ప్రత్యేక ఆసక్తి చూపించారు. ఈ సందర్భంగా చందుబట్ల గ్రామానికి చెందిన రైతు బిల్లాకంటి రామకృష్ణారావు యాప్ ద్వారా బుకింగ్ చేసుకుని యూరియా తీసుకెళ్లేందుకు దుకాణానికి వచ్చారు. నాలుగు ఎకరాల 26 గుంటల వ్యవసాయ భూమిలో సాగు చేస్తున్న పంటలకు అవసరమైన యూరియాను పొందేందుకు వచ్చిన రైతుకు దుకాణం సిబ్బంది ఎలాంటి విధానంలో యూరియాను అందజేస్తున్నారో కలెక్టర్ స్వయంగా గమనించారు. రైతుతో నేరుగా మాట్లాడిన కలెక్టర్ యాప్ వినియోగ అనుభవాన్ని తెలుసుకున్నారు. యాప్‌లో నమోదు చేసుకోవడం, యూరియా బుకింగ్ చేయడం, టోకెన్ పొందడం, దుకాణం వద్ద ఎరువు స్వీకరించడం వంటి ప్రక్రియల్లో ఏవైనా సాంకేతిక సమస్యలు ఎదురయ్యాయా, సిబ్బంది సహకారం ఎలా ఉంది, యూరియా అందుకోవడంలో ఆలస్యం జరిగిందా వంటి అంశాలను అడిగి తెలుసుకున్నారు. రైతులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సేవలు పొందేలా అన్ని చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా యాప్‌లో నమోదైన డిజిటల్ స్టాక్ వివరాలు మరియు దుకాణంలో వాస్తవంగా ఉన్న నిల్వల మధ్య సరిపోలికను కూడా కలెక్టర్ పరిశీలించారు. రైతులకు పంపిణీ చేసిన యూరియా బస్తాలను మినహాయించిన తర్వాత మిగిలిన నిల్వలు ఆన్‌లైన్ పోర్టల్‌లో సరిగ్గా ఉన్నాయా లేదా అనే విషయాన్ని తనిఖీ చేశారు. స్టాక్ వివరాల్లో ఎలాంటి వ్యత్యాసాలు ఉండకూడదని, ప్రతి పంపిణీని వెంటనే ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని దుకాణ నిర్వాహకులకు ఆదేశించారు. రైతులకు అవసరమైన యూరియా సకాలంలో అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, కృత్రిమ కొరత సృష్టించడం, నిల్వలను దాచిపెట్టడం, అధిక ధరలకు విక్రయించడం వంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు. ప్రభుత్వం రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని యూరియా బుకింగ్ యాప్‌ను అందుబాటులోకి తీసుకువచ్చిందని, దీని ద్వారా రైతులు తమ అవసరానికి అనుగుణంగా ముందుగానే యూరియాను బుక్ చేసుకుని సమయానికి పొందే అవకాశం కలుగుతుందని సూచించారు. యాప్ అమలుతో యూరియా పంపిణీలో పారదర్శకత పెరుగుతుందని, నిల్వలపై ఎప్పటికప్పుడు పర్యవేక్షణ సాధ్యమవుతుందని, రైతులు దుకాణాల చుట్టూ తిరగాల్సిన అవసరం తగ్గుతుందని కలెక్టర్ తెలిపారు. జిల్లాలోని అన్ని ఎరువుల విక్రయ కేంద్రాలు ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా వ్యవహరించాలని, రైతులకు స్నేహపూర్వకంగా సేవలు అందించాలని సూచించారు.
జిల్లా యంత్రాంగం యూరియా సరఫరాపై నిరంతర పర్యవేక్షణ కొనసాగిస్తుందని, ఎక్కడైనా రైతులకు ఇబ్బందులు తలెత్తినట్లు గుర్తిస్తే వెంటనే చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ స్పష్టం చేశారు. రైతుల అవసరాలకు అనుగుణంగా యూరియా సరఫరా జరిగేలా అధికారులు, ఎరువుల విక్రయదారులు సమన్వయంతో పనిచేయాలని ఆయన కోరారు. జిల్లా కలెక్టర్ వెంట జిల్లా వ్యవసాయ అధికారి యశ్వంత్ రావు, నాగర్ కర్నూల్ డివిజన్ వ్యవసాయ అధికారి పూర్ణచంద్రారెడ్డి, ఏవో శివ ఇతర అధికారులు తదితరులు ఉన్నారు.

## నాణ్యమైన విద్యను అందించాలి : ప్రభుత్వ విప్



(సమయం ప్రతినిధి–మహబూబ్ నగర్) : మహబూబ్ నగర్ నగరంలో బైపాస్ రోడ్ దగ్గర నూతనంగా నిర్మితమైన ఆర్కిడ్స్ ఇంటర్నేషనల్ స్కూల్ ను ప్రభుత్వ విప్, మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రస్తుత కాలంలో నాణ్యమైన విద్య ఎంతో అవసరమైందని, గ్రామీణ మరియు పట్టణ ప్రాంతాల విద్యార్థులకు సమాన అవకాశాలు కల్పించాల్సిన బాధ్యత అందరిదని తెలిపారు. ఆధునిక సదుపాయాలతో కూడిన విద్యాసంస్థలు విద్యార్థులలో సృజనాత్మకత, ప్రతిభను పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. ఆర్కిడ్స్ ఇంటర్నేషనల్ స్కూల్ వంటి విద్యాసంస్థలు మహబూబ్ నగర్ విద్యా రంగానికి కొత్త దిశను చూపిస్తాయని అభిప్రాయపడ్డారు. పాఠశాల యాజమాన్యం విద్యార్థులకు అత్యుత్తమ విద్యను అందించేందుకు కట్టుబడి ఉన్నదని, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ సమగ్ర విద్యను అందించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ శ్రీ మల్లు నర్సింహ్మారెడ్డి , మాజీ జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ శ్రీమతి స్వర్ణాసుధాకర్ రెడ్డి , నాయకులు శ్రీనివాస్ యాదవ్ , పాఠశాల డైరెక్టర్లు రవి నాయక్, నర్సింహ , మనోహర్ రెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులు, విద్యావేత్తలు, తల్లిదండ్రులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల నూతన గృహప్రవేశంలో పాల్గొన్న మహబూబ్ నగర్ డిప్యూటీ మేయర్

మహబూబ్‌నగర్ : ఈ రోజు మహబూబ్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్ 48వ డివిజన్ చెందిన P. లక్ష్మి W/o P. రమేష్ మరియు 29వ డివిజన్ కి చెందిన వరలక్ష్మి w/o వెంకటేష్ యాదవ్ లబ్ధిదారులు నూతన ఇందిరమ్మ ఇళ్ల నూతన గృహప్రవేశ ముఖ్య అతిథిగా హాజరైన లిలిమున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ శ్రీ మారేపల్లి సురేందర్ రెడ్డి(MSR) ప్రారంభించి లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు గిరి గౌడ్, ముజీబ్, కిషన్ నాయక్, మేగ్య నాయక్, వర్ధ రవి, గోపాల్, అషు, శేఖర్ నాయక్, శివ నాయక్, చంద్రమౌళి, వార్డు ఆఫీసర్స్, కాంగ్రెస్ పార్టీ నాయకులు మరియు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## రైతుభీమాను నిలిపేయడం కాంగ్రెస్ చారిత్రక ద్రోహం : మాజీమంత్రి నిరంజన్ రెడ్డి

(సమయం ప్రతినిధి వనపర్తి) : మట్టిని నమ్ముకున్న రైతు ఏ కారణం చేత మరణించినా ఆ కుటుంబానికి రూ.5 లక్షల సాయం అందే బృహత్తర పథకానికి కేసీఆర్ శ్రీకారం చుట్టారని బీఆర్ ఎస్ హయాంలో లక్ష 11,320 మంది రైతు కుటుంబాలకు సాయం అందిందని అంతర్జాతీయంగా యూఎన్ఓ ప్రశంసలు అందుకున్న రైతుబీమా పథకాన్ని నిలిపివేయడం కాంగ్రెస్ సర్కారు దుర్మార్గానికి పరాకాష్ట గా అభివర్ణించారు.ఎకరానికి ఏడాదికి రూ.10 వేల బదులు రూ.15 వేలు ఇస్తానని చెప్పి కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని దెప్పి పొడిచారు.ఇప్పుడు రైతుబీమా పథకానికి చెల్లించాల్సిన ప్రీమియం రూ.441 కోట్లు చెల్లించకపోవడంతో వివిధ కారణాలతో 7606 మంది రైతులకు రూ.5 లక్షల చొప్పున రావాల్సిన సాయం ఆగిపోయిందని మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి అన్నారు.రైతుభీమాకు ధీటుగా ప్రతి కుటుంబానికి బీమా అని జూన్ 2న ప్రకటనలు చేశారని గుర్తు చేస్తూ రాష్ట్రంలోని సుమారు 1.15 కోట్ల కుటుంబాలకు రూ. 5 లక్షల లైఫ్ ఇన్సూరెన్స్ కవరేజ్ అని ఊదరగొట్టారని, ఆరు గ్యారంటీల మాదిరిగానే ఈ పథకాన్ని ప్రభుత్వం అటకెక్కించిందని ఎద్దేవా చేశారు.రాత్ గయా .. బాత్ గయా అన్న తరహాలో కాంగ్రెస్ సర్కారు పాలన సాగిస్తోందని విమర్శించారు.రైతుబీమా పథకాన్ని యథాతథంగా కొనసాగించాలని డిమాండ్ చేశారు.కాంగ్రెస్ పార్టీ చేసిన రైతుద్రోహం చరిత్రలో నిలిచిపోతుందన్నారు. రైతుభీమా పథకం నిలిపివేయడంపై ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని మాజీ వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి విమర్శించారు.

## సవారమ్మ, కర్రెమ్మ అవ్వ వారి దర్శించుకున్న గద్వాల ఎమ్మెల్యే సతీమణి శ్రీమతి బండ్ల జ్యోతి



(సమయం ప్రతినిధి గద్వాల) : గద్వాల నియోజకవర్గం గద్వాల మండలం పరిధిలోని పరుమాల గ్రామంలోని గ్రామదేవత సవారమ్మ అవ్వ, కర్రెప్ప అవ్వ, దేవర సందర్భంగా అమ్మవారిని దేవాలయం లో ఎమ్మెల్యే సతీమణి శ్రీమతి బండ్ల జ్యోతి ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి ఆశీస్సులను పొందడం జరిగినది.
ఎమ్మెల్యే సతీమణి మాట్లాడుతూ.... గ్రామంలోని గ్రామ దేవతలను పూజించడం వల్ల గ్రామానికి ఇలాంటి చెడుగాలి సుఖకుండా గ్రామం పై ఎలాంటి నరదృష్టి రాకుండా గ్రామదేవతలు కాపాడడం జరుగుతుంది.గ్రామంలో ప్రతి ఇంట్లో దేవర సందర్భంగా పండగ వాతావరణం నెలకొంది జరిగినది. గ్రామదేవతలు ఆశీస్సులతో గ్రామంలోని ప్రజలు సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో అష్టైశ్వర్యాలతో నిండు నూరేళ్లు నూరేళ్లు జీవించాలని మనస్ఫూర్తిగా అమ్మవారిని కోరుకోవడం జరిగినది. ఈ కార్యక్రమంలో, రెడ్డి సేవా సమితి అధ్యక్షురాలు రాధారెడ్డి సర్పంచ్ సంధ్య ఆంజనేయులు , మాజీ సర్పంచ్ వాసు,నాయకులు, కరెంటు రాజు యాదవ్ శ్రీకాంత్ యాదవ్, వంశీ రాజు నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# యూరియా బుకింగ్ యాప్ ప్రారంభం



**రైతులు నేరుగా యాప్ ద్వారా యూరియా బుక్ చేసుకునే అవకాశం**
**యూరియా పంపిణీలో పారదర్శకత, సులభతర సేవలే లక్ష్యం**
**జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్, ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్ రెడ్డి**

నాగర్ కర్నూల్ సమయం ప్రతినిధి : నాగర్ కర్నూల్ జిల్లాలో రైతులకు యూరియా పంపిణీలో పారదర్శకతను పెంపొందించడంతో పాటు, ఎరువుల కోసం పడే ఇబ్బందులను తొలగించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన యూరియా బుకింగ్ యాప్‌ను అందుబాటులోకి తీసుకురావడం జరిగిందని, జిల్లాలోని 20 మండలాల్లో ఈ సేవలను నేటి నుండి ప్రారంభించగా, రైతులు ఇకపై నేరుగా తమ మొబైల్ ఫోన్ ద్వారా యూరియాను బుక్ చేసుకునే అవకాశం ఉందని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ తెలిపారు. గురువారం నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టరేట్ ప్రధాన సమావేశ మందిరంలో హాకా, ఆగ్రోస్, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు, క్రిమిసంహారక మందుల విక్రయ కేంద్రాల డీలర్లతో యూరియా పంపిణీ, యూరియా నిల్వలు, యాప్ ఆధారిత బుకింగ్ విధానం తదితర అంశాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో శాసన మండలి సభ్యుడు కూచుకుళ్ల దామోదర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్ రెడ్డి చేతుల మీదుగా యూరియా బుకింగ్ యాప్‌ను అధికారికంగా ప్రారంభించారు. అనంతరం యాప్ పనితీరు, రైతులకు అందించే సేవలు, బుకింగ్ విధానం గురించి అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్ రెడ్డి మాట్లాడుతూ..., రైతులకు యాప్ వినియోగంపై పూర్తిస్థాయి అవగాహన కల్పించేందుకు వ్యవసాయ శాఖ అధికారులు, డీలర్లు, సహకార సంఘాల ప్రతినిధులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలనికోరారు. యూరియా బుకింగ్ ప్రక్రియను రైతులకు సులభంగా వివరించి, ప్రతి రైతు సాంకేతిక సేవలను వినియోగించుకునేలా సహకరించాలని ఆయన సూచించారు. యాప్ ప్రారంభ దశలో కొన్ని సాంకేతిక సమస్యలు ఎదురయ్యే అవకాశం ఉన్నప్పటికీ, వాటిని అధిగమిస్తూ సేవలను విజయవంతంగా అమలు చేయాలని అధికారులను కోరారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వ్యవసాయ సీజన్ ప్రారంభానికి ముందుగానే యూరియా నిల్వలను సిద్ధం చేసిందని ఎమ్మెల్సీ తెలిపారు. జిల్లాలో యూరియా కొరత లేకుండా పంపిణీ ప్రక్రియను నిరంతరం పర్యవేక్షించాలని అధికారులకు సూచించారు. అంతర్జాతీయ పరిస్థితుల నేపథ్యంలో గల్ఫ్ దేశాల్లో నెలకొన్న యుద్ధ వాతావరణం కారణంగా యూరియా సరఫరాపై కొంత ప్రభావం పడే అవకాశం ఉన్నప్పటికీ, రైతులకు కొరత రాకుండా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని ఆయన వెల్లడించారు. అవసరమైన మేరకు యూరియా నిల్వలను సమకూర్చి రైతుల అవసరాలను తీర్చేందుకు చర్యలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు.ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ మాట్లాడుతూ...., రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా యూరియా పంపిణీ జరగడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ప్రస్తుతం జిల్లాలో సుమారు 32 వేల మెట్రిక్ టన్నుల యూరియా నిల్వలు అందుబాటులో ఉన్నాయని, రైతుల అవసరాలకు అనుగుణంగా వాటిని సకాలంలో పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. యాప్ ద్వారా బుకింగ్ చేసుకున్న రైతులకు ప్రాధాన్యతనిస్తూ, వారికి ఎరువులు సులభంగా అందే విధంగా వ్యవస్థను పటిష్టం చేయాలని సూచించారు. యాప్ ద్వారా రైతులు తమ అవసరానికి అనుగుణంగా యూరియాను ముందుగానే బుక్ చేసుకోవచ్చని, దీంతో ఎరువుల కోసం డీలర్ల వద్ద పడిగాపులు కాయాల్సిన అవసరం తగ్గుతుందని కలెక్టర్ తెలిపారు. యాప్ ద్వారా నమోదైన వివరాల ఆధారంగా యూరియా పంపిణీ చేపట్టడం వల్ల పారదర్శకత పెరగడంతో పాటు అక్రమ నిల్వలు, బ్లాక్ మార్కెటింగ్‌కు కూడా అడ్డుకట్ట పడుతుందని చెప్పారు. జిల్లాలో యూరియా పంపిణీ వ్యవస్థను మరింత సమర్థవంతంగా మార్చేందుకు డిజిటల్ విధానాలను అమలు చేస్తున్నామని అధికారులు తెలిపారు. రైతులు యాప్‌ను సద్వినియోగం చేసుకొని ముందస్తుగా యూరియాను బుక్ చేసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ అమరేందర్, జిల్లా వ్యవసాయ అధికారి యశ్వంత్ రావు, జిల్లా సహకార అధికారి రఘునాథ్ రావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు అశోక్, హర్షవర్ధన్, మండల స్థాయి వ్యవసాయ అధికారులు, హాకా, ఆగ్రోస్ ప్రతినిధులు, సహకార సంఘాల అధికారులు, డీలర్లు తదితరులు పాల్గొన్నారు.

# సచివాలయం ముట్టడికి జర్నలిస్టుల యత్నం

**- అడ్డుకున్న పోలీసులు - గన్ పార్కు వద్ద అరెస్టులు**



హైదరాబాద్ : రాష్ట్ర ప్రభుత్వ వివక్ష, నిర్లక్ష్య వైఖరికి నిరసనగా,తమ డిమాండ్ల సాధనకై గురువారం జర్నలిస్టులు "ఛలో హైదరాబాద్"కార్యక్రమం నిర్వహించారు. గన్ పార్క్ నుంచి సచివాలయం ముట్టడికి బయలుదేరిన జర్నలిస్టులను పోలీసులు అడ్డుకొని అరెస్టు చేశారు. తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర కమిటీ ఇచ్చిన "ఛలో హైదరాబాద్" పిలుపు మేరకు రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల నుంచి తరలివచ్చిన జర్నలిస్టుల గన్ పార్క్ వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఫెడరేషన్ వ్యవస్థాపక,రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య గన్ పార్క్ లోని తెలంగాణ అమరవీరుల స్థూపం వద్ద పూలు పెట్టి నివాళులర్పించారు.అనంతరం తెలంగాణ అమరవీరుల స్థూపానికి వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా మామిడి సోమయ్య మాట్లాడుతూ, ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలో పన్నెండేళ్ళుగా జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించకుండా పాలకులు వివక్ష చూపుతున్నారని విమర్శించారు.తెలంగాణ కోసం తెలంగాణ జర్నలిస్టులు అన్న నినాదంతో తెలంగాణ రాష్ట్రం కోసం పోరాడిన జర్నలిస్టులను పాలకులు చిన్నచూపు చూడడం దుర్మార్గమని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండున్నర సంవత్సరాలు గడిచినప్పటికీ, జర్నలిస్టులకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రభుత్వం మొండి చేయి చూపుతూ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని దుయ్యబట్టారు. తెలంగాణలో అనేక చిన్న, మధ్య తరహా పత్రికలు మూతపడే పరిస్థితి ఏర్పడిందని, రెండున్నర సంవత్సరాలుగా ప్రభుత్వం అడ్వర్టైజ్మెంట్స్ బిల్స్ ఇవడంలేదని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. పెండింగ్ బిల్స్ వెంటనే ఇవ్వాలని, ప్రతి వర్కింగ్ జర్నలిస్టుకు అక్రెడిటేషన్ కార్డుతో పాటు హెల్త్ కార్డు ఇవ్వాలని, గ్రేటర్ హైదరాబాద్ తో సహా రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టులకు ఇండ్లు, ఇండ్లస్థలాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఆర్ఎన్ఐ, పీఆర్జీఐ రిజిస్ట్రేషన్ తో రెగ్యులారిటీ ఉన్న పత్రికలను ఎంపానల్మెంట్ చేయాలని, జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్లు, కళాశాలల్లో ఉచిత విద్యను అందించాలని, కార్పొరేట్ ఆసుపత్రుల్లో ఉచిత వైద్య సదుపాయం కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు.ప్రతి జర్నలిస్టుకు ఉచిత బీమా పథకం ఏర్పాటు చేయాలని, 60 సంవత్సరాలు దాటిన జర్నలిస్టులకు పెన్షన్లు ఇవ్వాలని, జర్నలిస్టుల సంక్షేమానికి బడ్జెట్ లో రూ.100 కోట్లు కేటాయించాలని, జర్నలిస్టుకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలని కోరారు. ఈ నిరసన కార్యక్రమంలో రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చిన అనేక మంది జర్నలిస్టులు పాల్గొని ప్లకార్డులతో నినదించారు. అనంతరం ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ భారీ ర్యాలీ నిర్వహించగా పోలీసులు వారిని అడ్డుకొని అరెస్టు చేశారు. అరెస్టు చేసిన వారిని పంజాగుట్ట పోలీస్ స్టేషన్,ఆసిఫ్ నగర్ పోలీస్ స్టేషన్ లకు తరలించారు. జర్నలిస్టుల న్యాయమైన కోర్కెలను ప్రభుత్వం నెరవేర్చకపోతే రాబోయే కాలంలో గత ప్రభుత్వాని పట్టిన గతే ఈ ప్రజా ప్రభుత్వానికీ పడుతుందని మామిడి సోమయ్య హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కో-కన్వీనర్లు బండి విజయ్ కుమార్, యాదగిరి, తన్నీరు శ్రీనివాస్, నేషనల్ కౌన్సిల్ మెంబర్ చిర్రా శ్రీనివాస్, దామెర జగదీశ్వర్ గుప్తా, కే. పాండురంగారావు, పద్మనాభరావు, సామ్రాట్ గుప్తా, హైదరాబాద్ జిల్లా కన్వీనర్ వి. రవి కుమార్, కో-కన్వీనర్లు ఆర్. శ్రీనివాస్ గౌడ్, సంతోష్ కుమార్, ఎం.రవికుమార్, సుభాష్, రేగటి వెంకన్న, ఖమ్మం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నానబాల రామకృష్ణ, అర్వపల్లి నగేష్, మహబూబ్ నగర్ జిల్లా కార్యాధ్యక్షుడు గండీటి నర్సింహా, కార్యదర్శి గోపాల్, మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు మధు, సూర్యాపేట జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పాల్వాయి జానయ్య, ముషం హరిప్రసాద్, వరంగల్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జక్కుల విజయ్ కుమార్, స్వామిదాస్, పాలడుగు సురేందర్, నాగర్ కర్నూల్ జిల్లా అధ్యక్షుడు దూమర్ల బాస్కర్, రంగారెడ్డి జిల్లా నాయకులు అశోక్ కుమార్ గౌడ్, పర్వతాలు, మేడ్చల్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మల్లేశం,గడ్డమీది అశోక్ తదితరులు పాల్గొన్నారు.





## పచ్చదనమే లక్ష్యం 57.70 లక్షల మొక్కలు నాటడమే ధ్యేయం

సమయం ప్రతినిధి, నల్లగొండ : మొక్కలు మానవ మనుగడకు మూలాధారమని, పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటాలని నల్లగొండ జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. గురువారం స్థానిక కోమటిరెడ్డి ప్రతీక్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్, జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్, మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస రెడ్డి కలిసి మొక్కలు నాటి ఈ కార్యక్రమాన్ని అధికారికంగా ప్రారంభించారు.రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా జిల్లాలో వనమహోత్సవ కార్యక్రమం గురువారం నుండి ముమ్మరంగా ప్రారంభమైందని ఆయన తెలిపారు. గత ఏడాది జిల్లాలో 90 శాతం మొక్కలు నాటి అనుకున్న లక్ష్యాన్ని సాధించామని, ఈ సంవత్సరం వంద శాతం లక్ష్యాన్ని చేరుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. ఈ ఏడాది జిల్లా వ్యాప్తంగా 57 లక్షల 70 వేల మొక్కలు నాటాలని పటిష్ట లక్ష్యాన్ని నిర్దేశించుకున్నట్లు పేర్కొన్నారు. నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఈ సంవత్సరం 1.65 లక్షల మొక్కలు నాటేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. కార్పొరేషన్ పరిధిలోని ఖాళీ స్థలాలు (ఓపెన్ ప్లాట్స్), పార్కులు, రోడ్ల ఇరువైపులా పెద్ద ఎత్తున మొక్కలు నాటాలని సూచించారు. చారిత్రాత్మక లతీఫ్ సాబ్ గుట్టపై ఎలాంటి మొక్కలు నాటితే బాగుంటుందనే అంశంపై జిల్లా అటవీ అధికారి ప్రత్యేక కార్యాచరణను రూపొందిస్తున్నారని కలెక్టర్ వెల్లడించారు. ప్రభుత్వ సంకల్పాన్ని విజయవంతం చేయడానికి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలన్నారు. ముఖ్యంగా ఇంటి ఆవరణలో ప్రతి ఇల్లాలు 6 మొక్కలు నాటాలని, ఈ హరిత యజ్ఞంలో మహిళల పాత్ర అత్యంత కీలకమని స్పష్టం చేశారు. అనంతరం మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ.. నగరాల విస్తరణ, పెరుగుతున్న నిర్మాణాల వల్ల మొక్కల సంఖ్య తగ్గిపోతోందని మేయర్ శ్రీమతి బుర్రి చైతన్య శ్రీనివాస రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుత ప్రపంచ పరిస్థితుల్లో దాదాపు 5000 కోట్ల మొక్కల అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ఆమీర్ అలీ, జిల్లా అటవీ అధికారి రాజశేఖర్ పాల్గొని ప్రసంగించారు.

## NAC ట్రైనింగ్ సెంటర్‌తో యువతకు ఉపాధి అవకాశాల విస్తరణ: ప్రభుత్వ విప్

మహబూబ్ నగర్: నియోజకవర్గంలోని అల్లిపూర్ గ్రామంలో నిర్మించనున్న చీూజ (నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్) ట్రైనింగ్ సెంటర్ స్థలాన్ని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే లియెన్నం శ్రీనివాస్ రెడ్డి రెవెన్యూ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన అధికారులకు తక్షణమే పనులు ప్రారంభించాలని ఆదేశాలు జారీచేశారు. జిల్లా కేంద్రానికి అత్యంత సమీపంలో ఉన్న ఈ ప్రాంతంలో చీూజ ట్రైనింగ్ సెంటర్ ఏర్పాటు చేయడం వల్ల స్థానిక యువతకు నైపుణ్యాభివృద్ధి కలిగి, ఉపాధి అవకాశాలు విస్తృతంగా లభిస్తాయని ఆయన పేర్కొన్నారు. నిర్మాణ రంగంలో అవసరమైన నైపుణ్యాలను యువతకు అందించేందుకు చీూజ సెంటర్ కీలక పాత్ర పోషిస్తుందని, గ్రామీణ ప్రాంత యువతకు ఇది ఎంతో ఉపయోగపడు తుందని తెలిపారు. ప్రభుత్వం యువత భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఇలాంటి శిక్షణా కేంద్రాలను ఏర్పాటు చేస్తోందని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, సర్పంచ్ విజయలక్ష్మి, నాయకులు శ్రీనివాస్ యాదవ్, సుధీంద్ర గౌడ్, శ్రీనివాస్ గౌడ్, దాసరి వెంకటేష్, ఎల్లస్వామి తదితరులు పాల్గొన్నారు.



## ఆర్టీసీ ఉద్యోగులకు 11 శాతం వేతన పెంపు జులై 1 నుంచి అమలు : మంత్రి పొన్నం ప్రభాకర్

సమయం ప్రతినిధి, హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఉద్యోగులకు జులై 1 నుంచి 11 శాతం వేతన పెంపు అమలు చేయనున్నట్లు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రకటించారు. ఆర్టీసీ సమ్మె సందర్భంగా ఇచ్చిన హామీని ప్రభుత్వం నెరవేర్చుతోందని తెలిపారు. గురువారం హైదరాబాద్‌లో ఆర్టీసీ ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మంత్రి ఈ ప్రకటన చేశారు. ఆర్టీసీ గుర్తింపు సంఘాల ఎన్నికల షెడ్యూల్ విడుదలకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. నాగర్‌కర్నూల్, పెద్దపల్లి బస్ డిపోల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. వేములవాడ, కథలాపూర్ బస్ స్టేషన్లకు త్వరలో శంకుస్థాపన చేయనున్నట్లు వెల్లడించారు. హుజూర్‌నగర్, కోదాడ, నాగర్‌కర్నూల్ బస్ స్టేషన్ల నిర్మాణాలకు ఆమోదం తెలిపినట్లు చెప్పారు. ములుగు బస్ స్టేషన్ నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలని సూచించారు. మహాలక్ష్మి పథకంపై ప్రత్యేక అధ్యయనం చేపట్టాలని, మహిళా సంఘాల ఆధ్వర్యంలో నడుస్తున్న 553 బస్సుల పనితీరుపై నివేదిక సమర్పించాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో నడుస్తున్న 1,050 విద్యుత్ బస్సుల నిర్వహణపై సమగ్ర నివేదిక అందించాలని సూచించారు. రాష్ట్ర ఆర్టీసీ వద్ద ప్రస్తుతం 10,173 బస్సులు, 38,128 మంది ఉద్యోగులు ఉన్నారని, రోజుకు 61 లక్షల మంది ప్రయాణికులు సేవలు పొందుతున్నారని మంత్రి తెలిపారు. పెండింగ్ కారుణ్య నియామకాలను వెంటనే పూర్తి చేయాలని ఆదేశించిన మంత్రి, గతంలో తొలగించిన 244 మంది ఉద్యోగులను తిరిగి విధుల్లోకి తీసుకున్నట్లు వెల్లడించారు. ఉద్యోగి శంకర్ కుటుంబానికి రూ.1 కోటి ఆర్థిక సహాయం, కుటుంబ సభ్యుడికి ఉద్యోగం, ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసినట్లు తెలిపారు. దక్షిణ భారత రాష్ట్రాల రవాణా శాఖ మంత్రులతో త్వరలో ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు.

## పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

**-వనమహోత్సవ కార్యక్రమంలో రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జి. చిన్నారెడ్డి.**
**-వాతావరణ మార్పుల ప్రభావాన్ని తగ్గించడంలో మొక్కలు కీలక పాత్ర పోషిస్తాయి. -జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి.**

వనపర్తి, సమయం ప్రతినిధి : వనపర్తి పట్టణంలోని ఎకో పార్క్‌లో గురువారం అటవీ శాఖ ఆధ్వర్యంలో వనమహోత్సవ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జి. చిన్నారెడ్డి, జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు పాఠశాల విద్యార్థులతో కలిసి మొక్కలు నాటి వాటికి నీరు పోశారు.అనంతరం మాట్లాడిన ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు మాట్లాడుతూ, హైదరాబాద్‌లోని గుర్రంగూడలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వనమహోత్సవ కార్యక్రమాన్ని ప్రారంభించారని తెలిపారు. అదే స్ఫూర్తితో వనపర్తి ఎకో పార్క్‌లో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది 16 కోట్ల మొక్కలు నాటే లక్ష్యంతో ముందుకు సాగుతోందని, వనపర్తి జిల్లాకు 24 లక్షల మొక్కలు నాటే లక్ష్యాన్ని నిర్దేశించినట్లు చెప్పారు. ప్రకృతి సమతుల్యతకు చెట్లు ఎంతో ముఖ్యమని, మంచి వర్షాలు కురవాలంటే విస్తృతంగా మొక్కలు నాటాల్సిన అవసరం ఉందన్నారు. ప్రస్తుతం సుమారు 24 శాతం మాత్రమే అటవీ విస్తీర్ణం ఉందని, దానిని 33 శాతానికి పెంచేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని పిలుపునిచ్చారు.జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి మాట్లాడుతూ, జిల్లాలో వనమహోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభించామని తెలిపారు. ముఖ్య అతిథులతో పాటు విద్యార్థులు తమ పేర్లపై మొక్కలు నాటడం అభినందనీయమన్నారు. వర్షాకాలం ప్రారంభమవుతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడాన్ని బాధ్యతగా తీసుకోవాలని సూచించారు.వాతావరణ మార్పుల ప్రభావాన్ని తగ్గించడంలో మొక్కలు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్న కలెక్టర్, నాటిన ప్రతి మొక్కను సంరక్షించడం కూడా అంతే ముఖ్యమని అన్నారు. జిల్లాకు నిర్దేశించిన 24 లక్షల మొక్కల లక్ష్యాన్ని సాధించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతతో నడుంబిగించి మొక్కలు నాటాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు ఖీమ్య నాయక్, జెడ్పి సీఈవో యాదయ్య, స్థానిక కౌన్సిలర్ మహేశ్వరి, అటవీ శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు మరియు పలు శాఖల సిబ్బంది పాల్గొన్నారు.



# ఆహార భద్రత విషయంలో రాజీ లేదు, నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

**ప్రతి వారం హోటళ్లు, బేకరీల తనిఖీకి జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ ఆదేశాలు**

**ఫుడ్ సేఫ్టీ సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్**



**నాగర్ కర్నూల్ సమయం ప్రతినిధి :** నాగర్‌కర్నూల్ జిల్లాలో ప్రజలకు నాణ్యమైన, సురక్షితమైన ఆహార పదార్థాలు అందేలా ఆహార భద్రతా ప్రమాణాల అమలుపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ ఫుడ్ సేఫ్టీ అధికారిని శ్రీలతను ఆదేశించారు. గురువారం జిల్లా కలెక్టర్ ఛాంబర్‌లో నిర్వహించిన ఫుడ్ సేఫ్టీ సమీక్ష సమావేశానికి జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ అధ్యక్షత వహించి జిల్లాలో ఆహార భద్రత పరిస్థితులు, తనిఖీల పురోగతి, ఆహార నమూనాల సేకరణ, నిబంధనల అమలు తదితర అంశాలపై సమగ్రంగా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ మాట్లాడుతూ......, ప్రజల ఆరోగ్యం అత్యంత ప్రాధాన్యమైన అంశమని, ఆహార పదార్థాల తయారీ, నిల్వ, విక్రయ ప్రక్రియల్లో ఎలాంటి నిర్లక్ష్యం సహించబోమని, జిల్లాలోని అన్ని హోటళ్లు, రెస్టారెంట్లు, బేకరీలు, స్వీట్స్ తయారీ కేంద్రాలు, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు, కూల్‌డ్రింక్స్ విక్రయ కేంద్రాలు, ఇతర ఆహార వ్యాపార సంస్థలను క్రమం తప్పకుండా తనిఖీ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రతి వారం హోటళ్లు, బేకరీలను తనిఖీ చేసి ఆహార పదార్థాల నమూనాలను సేకరించి ప్రయోగశాలలకు పంపించాలని జిల్లా ఫుడ్ ఇన్‌స్పెక్టర్ శ్రీలతకు ఆదేశాలు జారీ చేశారు. నమూనాల పరీక్షల్లో నాణ్యత లోపాలు, కల్తీ లేదా నిబంధనల ఉల్లంఘనలు గుర్తించినట్లయితే సంబంధిత యజమానులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, కలెక్టర్ సూచించారు. ఆహార భద్రతా ప్రమాణాలను పాటించకుండా పరిశుభ్రత లేని వాతావరణంలో వ్యాపారాలు నిర్వహిస్తున్న హోటళ్లు, బేకరీలపై ప్రత్యేక నిఘా ఉంచాలని కలెక్టర్ సూచించారు. వంటశాలలు, ఆహార నిల్వ గదులు, తాగునీటి సదుపాయాలు, ఆహార పదార్థాల నిల్వ విధానాలు, సిబ్బంది వ్యక్తిగత పరిశుభ్రత వంటి అంశాలను తనిఖీల్లో తప్పనిసరిగా పరిశీలించాలని ఆదేశించారు. గడువు ముగిసిన ఆహార పదార్థాలు, నాసిరకం నూనెలు, రంగులు లేదా ఆరోగ్యానికి హానికరమైన రసాయనాలను ఉపయోగిస్తున్నట్లు గుర్తించినట్లయితే వెంటనే కేసులు నమోదు చేసి చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడే వారిపై ఎలాంటి ఉపేక్ష ఉండదని హెచ్చరించారు. జిల్లాలోని అన్ని ఆహార వ్యాపార సంస్థలు తప్పనిసరిగా ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (FSSAI) నిబంధనలను పాటించాలని, చెల్లుబాటు అయ్యే లైసెన్సులు, రిజిస్ట్రేషన్లు కలిగి ఉండాలని తెలిపారు. లైసెన్సులు లేకుండా నిర్వహిస్తున్న వ్యాపార సంస్థలను గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. వినియోగదారులలో కూడా ఆహార భద్రతపై అవగాహన పెంపొందించే కార్యక్రమాలు చేపట్టాలని, ఆహార పదార్థాలు కొనుగోలు చేసే సమయంలో తయారీ తేదీ, గడువు తేదీ, నాణ్యత ప్రమాణాలను పరిశీలించాలని ప్రజలకు సూచనలు అందించాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో ఆహార భద్రతా ప్రమాణాల అమలులో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా ప్రతి వారం తప్పకుండా తనిఖీలు నిర్వహించి నివేదికలు సమర్పించాలని, ప్రతి వారం సమీక్ష సమావేశం నిర్వహించనున్నట్లు, ప్రజలకు ఆరోగ్యకరమైన, సురక్షితమైన ఆహార వాతావరణం కల్పించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని కలెక్టర్ అన్నారు. ఈ సమావేశంలో జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారిని శ్రీలత, జిల్లా విద్యాశాఖ అధికారి ఏ రమేష్ కుమార్, జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ఇంచార్జ్ అధికారిని దమయంతి, వైద్య ఆరోగ్య శాఖ అధికారి పాల్గొన్నారు.

# అంగన్‌వాడి కేంద్రాల్లో చిన్నారుల నమోదు పెంచాలి

**"అమ్మ మాట - అంగన్‌వాడి బాట" పోస్టర్ ఆవిష్కరించిన కలెక్టర్ ఖుష్బూ గుప్తా**



**సమయం ప్రతినిధి, మహబూబ్‌నగర్ :** మూడు నుంచి ఐదు సంవత్సరాల వయస్సు గల ప్రతి చిన్నారిని అంగన్‌వాడి కేంద్రాల్లో నమోదు చేయించి వారికి నాణ్యమైన ప్రాథమిక విద్య, పోషకాహారం, ఆరోగ్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా సూచించారు. మహిళా, శిశు, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న "అమ్మ మాట - అంగన్‌వాడి బాట" కార్యక్రమంలో భాగంగా గురువారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కార్యక్రమ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జూన్ 13 నుంచి 19 వరకు జిల్లాలోని అన్ని అంగన్‌వాడి కేంద్రాల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. చిన్నారుల సమగ్ర అభివృద్ధికి అంగన్‌వాడి కేంద్రాలు కీలకమని, తల్లిదండ్రులు తమ పిల్లలను తప్పనిసరిగా నమోదు చేయించాలని కోరారు. అలాగే ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, స్వయం సహాయక సంఘాల మహిళలు, ఏఎల్‌ఎంఎస్‌సీ కమిటీ సభ్యులు ప్రజల్లో అవగాహన కల్పించి అంగన్‌వాడి కేంద్రాల బలోపేతానికి సహకరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ (శిక్షణలో) సాయి శివాని, జిల్లా సంక్షేమ అధికారి ఎస్. జరీనా బేగం, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ శ్రీనివాసులు, జిల్లా విద్యాశాఖ అధికారి విజయకుమారి తదితరులు పాల్గొన్నారు.

# పేదల ఆత్మగౌరవమే కాంగ్రెస్ లక్ష్యం : ఎమ్మెల్యే

**(సమయం ప్రతినిధి మహబూబ్నగర్) :** పేదల పక్షాన నిలబడి వారి ఆత్మగౌరవాన్ని పెంపొందించే విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలన కొనసాగిస్తోందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. మహబూబ్ నగర్ నియోజకవర్గంలోని ఓబ్లాయిపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇండ్లను ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అర్హులైన ప్రతి కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. గత ఏడాది మన నియోజకవర్గానికి 3500 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు కాగా, ఈ సంవత్సరం కూడా అదే స్థాయిలో ఇండ్లు రానున్నాయని స్పష్టం చేశారు. పేదలకు సొంత ఇల్లు కల్పించడం ద్వారా వారి జీవన ప్రమాణాలు మెరుగుపడటమే కాకుండా, సమాజంలో గౌరవప్రదమైన స్థానం కలుగుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి , గ్రామ సర్పంచ్ కృష్ణయ్య, కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షులు కుర్మయ్య, ఉప సర్పంచ్ చంద్రకళ, నాయకులు రామచంద్రయ్య , శ్రీనివాస్ యాదవ్, మాధవ రెడ్డి, రఘు నాయక్, మల్లు అనిల్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, అనిల్, వెంకట్ రాములు పాల్గొన్నారు.

# మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షిద్దాం: పద్మజా రెడ్డి



**సమయం ప్రతినిధి, మహబూబ్‌నగర్ :** ప్రతి ఒక్కరూ తమకు జన్మనిచ్చిన తల్లికి గుర్తుగా ఒక మొక్కను నాటి పర్యావరణ పరిరక్షణకు తోడ్పడాలని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు జి. పద్మజా రెడ్డి పిలుపునిచ్చారు. ప్రధానమంత్రి ఇచ్చిన పిలుపు మేరకు "తల్లికి ప్రేమతో ఒక మొక్క" కార్యక్రమంలో భాగంగా గురువారం 36వ డివిజన్ పరిధిలోని మోనప్పగుట్టలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. 36వ డివిజన్ కార్పొరేటర్ అభ్యర్థి పెద్ద నరసింహులు అధ్యక్షతన జరిగిన ఈ కార్య క్రమంలో పద్మజా రెడ్డితో పాటు సీనియర్ నాయకుడు బాలరాజు, 38వ డివిజన్ కార్పొరేటర్ పిట్టల యాదయ్య పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడు తూ ప్రతి వ్యక్తి తన జీవితంలో కనీసం ఒక మొక్కను నాటి దానిని సంరక్షిం చాలని సూ చించారు. ప్రతి జీవికి అవసరమైన ప్రాణ వాయువు మొక్కల ద్వారానే లభిస్తుందని, పర్యావరణ సమతుల్య తకు చెట్లు ఎంతో అవసరమని పేర్కొన్నారు. అలాగే నివాస ప్రాంతాల పరిసరాలను పరిశు భ్రంగా ఉంచడం ద్వారా అనేక రోగాలను నివారించవచ్చని తెలిపారు. మొక్కలు నాటడమే కాకుండా వాటి సంరక్షణ బాధ్యతను కూడా ప్రతి ఒక్కరూ తీసుకోవాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ పార్వతమ్మ, వెంకటరాములు, పోతుల రాజేందర్ రెడ్డి, కృష్ణయ్య, చందర్, వెంకటేష్, వెంకటయ్య, మధు, బోయ శ్రీనివాసులు, అంజన్ కుమార్, వేణుగోపాల్, రవికుమార్, వెంకటయ్య మన్యం, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# మాదకద్రవ్యాల రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

**-జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి**



**వనపర్తి, సమయం ప్రతినిధి :** అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగ మరియు అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం (International Day Against Drug Abuse and Illicit Trafficking) సందర్భంగా వనపర్తి జిల్లాలో నిర్వహించనున్న "నషా ముక్త్ భారత్ సప్తాహ్" కార్యక్రమాల పోస్టర్‌ను జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి గురువారం కలెక్టరేట్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ యువత మాదకద్రవ్యాల బారిన పడకుండా అవగాహన కల్పించడం, మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలపై ప్రజల్లో చైతన్యం తీసుకురావడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. మాదకద్రవ్యాల నిర్మూలనకు ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, సమాజాన్ని నషా రహితంగా తీర్చిదిద్దేందుకు అందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ శాఖ అధికారి కె. సుధారాణి, డీసీపీఓ ఎం. రాంబాబు, జిల్లా బాలల అభివృద్ధి ప్రాజెక్టు అధికారులు (సీడీపీఓలు), డ్రగ్ డీ-అడిక్షన్ సెంటర్ కో-ఆర్డినేటర్ వెంకట్ రెడ్డి మరియు వారి బృందం, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.




OWNED, PRINTED AND PUBLISHED BY KARNAM BHASKAR RAO, PRINTED AT SHREYA SREE PRINTERS, H.NO.1-3-129, RAJENDRA NAGAR, MAHABUBNAGAR DIST., T.S. PUBLISHED AT SREEJA SREE PUBLICATONS, H.NO.1-3-129, RAJENDRA NAGAR, MAHABUBNAGAR DIST, T.S, RNI NO: APTEL/2012/47246 EDITOR : KARNAM BHASKAR RAO, Ph: 08542-222814, Cell: 9848997085